

సీతమ్మధార ప్రాంతంలో అధ్వానంగా రహదారి

అంతర్గత రహదారులు అధ్వానం

యూజీడీ గోతులతో వాహన చోదకులకు నిత్యం నరకం



పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి వద్ద శిథిలమైన రోడ్డు

- కేబుళ్ల కోసం రోడ్ల తవ్వకాలు... పైపైన పూడ్చివేతలు
- పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ పరిధిలో అంతర్గత రహదారులను అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన మార్గాలు బాగుంటే చాలు అనుకుంటూ కాలనీ రహదారులను గాలికి వదిలేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రోడ్ల మధ్య తవ్వకాలు జరుపుతున్న కాంట్రాక్టర్లు నెలల తరబడి వాటిని పూర్తి చేయడం లేదు. తమ పని పూర్తయిన తరువాత ఆ గోతుల్లో రాళ్లు పోసి చేతులు దులుపుకుంటున్నారు.

సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ, టీపీటీ కాలనీల్లో రహదారులు కాంట్రాక్టర్ల దుర్మార్గానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇకపోతే కేబుళ్ల కోసం, పైపులైన్ల కోసం రోడ్డుకు ఒకపక్కగా ... మిగతా 6వ పేజీలో

- భీమునిపట్నంలోని చిన్నబజారు నుంచి తాళ్లవలస వెళ్లే రహదారి గోతులతో అత్యంత దారుణంగా ఉంది. చిన్నబజారు నుంచి యాతకుమ్మరిపాలెం, యాతపేట మీదుగా తగరపువలస-ఆనందపురం జాతీయ రహదారి చేరుకోవడానికి ప్రజలు ఈ రోడ్డును వినియోగిస్తుంటారు. ఈ రోడ్డు 3 కిలోమీటర్లు జీవీఎంసీ పరిధిలోను, 1200 మీటర్లు భీమిలి మండల పరిషత్ పరిధిలోనూ ఉంది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా గోతులతో నిండిపోయింది. వర్షం పడితే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.
- పద్మనాభం మండలంలో చిన్నాపురం జంక్షన్-పద్మనాభం-శొంఠ్యాం ఆర్అండ్‌బీ రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతులు మరింత ఛిద్రంగామారాయి. గతుకుల రోడ్డులో ప్రయాణాల వల్ల తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.చిన్నాపురం జంక్షన్ నుంచి రెడ్డిపల్లి సినిమాహాలు వరకు, రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకు వద్ద నుంచి శేరిఖండం వరకు, పద్మనాభం జంక్షన్ నుంచి బాకురుపాలెం వరకూ సుమారు పది కిలోమీటర్లు రోడ్డంతా గోతులతో అధ్వానంగా ఉంది.

మహా రచ్చ

వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణ చూస్తున్న 'రాశా' సంస్థపై అంత ప్రేమ ఎందుకని నిలదీసిన సభ్యులు

- వీధి దీపాల నిర్వహణ కాంట్రాక్టర్, క్లాప్ వాహనాల కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి
- నగరంలోని ప్రధాన రహదారులను పీపీపీకి అప్పగించాలనే ప్రతిపాదనపై రభస
- చివరకు అజెండాలోని 131 అంశాలకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం
- రెల్లివీధి పేరు మార్పునకు తిరస్కృతి

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై కౌన్సిల్ సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధాన అజెండాలో పొందుపరిచిన 90 అంశాలతోపాటు టేబుల్ అజెండాగా చేర్చిన 42 అంశాలపై సభ్యులు చర్చించారు. వీటిలో 131 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలపగా, రెల్లివీధి పేరును శబరి నగర్‌గా మార్చే ప్రతిపాదనను కౌన్సిల్ తిరస్కరించింది.

కౌన్సిల్ ప్రారంభం కాగానే అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా తీర్మానం చేయడంతోపాటు స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు కోరారు. దీనికి వైసీపీ సభ్యులు కూడా మద్దతు తెలుపుతూ నల్లకండువాలు వేసుకుని 'గో బ్యాక్ అంబుజా', 'సీఎం రాజీనామా చేయాలి' అని ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. కొద్దిసేపు అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం ... మిగతా 6వ పేజీలో



స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ మేయర్ పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న వైసీపీ కార్పొరేటర్లు

స్టీల్‌ప్లాంటుపై వైసీపీ డ్రామా

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసినప్పుడు రాష్ట్రంలో వైసీపీనే అధికారంలో ఉంది. ఆ సమయంలో కర్మాగారాన్ని ఆదుకునేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఉద్యమిస్తే ఆ పార్టీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంఘీభావం ప్రకటించలేదు. చివరకు ఎన్నికల మధురవాడ వద్ద కార్మిక సంఘాల నేతలు కలిసి, అప్పుల్లో ఉన్న ప్లాంటును ఆదుకోవాలని కోరితే...'అవునా...స్టీల్‌ప్లాంట్ అప్పుల్లో ఉందా?' అంటూ ఆ విషయమే తనకు తెలియదన్నట్టు మాట్లాడారు. ప్లాంటుకు సంబంధించి విద్యుత్ బిల్లు చెల్లింపు, గనుల లీజు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున సాయం చేసేందుకు కూడా నిరాకరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్టీల్‌ప్లాంటుకు కేంద్ర నుంచి సుమారు రూ.11,500 కోట్ల ప్యాకేజీ వచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు రూపాల్లో సుమారు రూ.2 వేల కోట్ల సాయం అందించేందుకు నిర్ణయించింది. ఇటువంటి తరుణంలో స్టీల్‌ప్లాంటును కాపాడాలని, ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ వైసీపీ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్‌లో హడావిడి చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

రైల్వే జోన్‌కు ఇంకా రెడ్ సిగ్నలే...



గెజిట్ విడుదలలో తాత్సారం

- ఖాళీగా కొత్త జీఎం
- 'తూర్పు కోస్తా' పెత్తనంలోనే వాల్తేరు డివిజన్
- మరోవైపు 'డెక్'లో దక్షిణ కోస్తా కార్యాలయం పనులు పూర్తి
- ముడసర్లోవలో జోనల్ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభం



ముడసర్లోవలో రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
'తాంబూలాలు ఇచ్చాం...తన్నుకు చావండి' అన్నట్టుగా ఉంది విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిస్థితి. జోన్‌కు అతి ముఖ్యమైన గెజిట్‌ను విడుదల చేయకపోవడం వల్ల ఏ అధికారీ ఏ పని చేయలేకపోతున్నారు. ఆ గెజిట్ విడుదలైతేనే 'జోన్ ఆపరేషన్' ప్రారంభమవుతుంది. అది ఇవ్వకపోవడం వల్ల విశాఖపట్నం ఇప్పటికీ తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోనే ఉంది. విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ ఆ జోన్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే నడుచుకుంటున్నారు.

దక్షిణ కోస్తా జోన్‌కు జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను జూన్ మొదటి వారంలో నియమించారు. ఆయన వచ్చి ఐదు నెలలైంది. ప్రత్యేకమైన రైలులో జోన్ మొత్తం తిరుగుతూ వివిధ పనులు పర్యవేక్షించాల్సిన ఆయన డీఆర్ఎం కార్యాలయంలోని చిన్న గదిలో కూర్చుంటున్నారు. జోన్ కార్యాలయం కోసం ముడసర్లోవలో రూ.172 కోట్లతో పనులు ప్రారంభించారు. అక్కడ చకచకా పనులు జరుగుతున్నాయి. దీనిని పూర్తి చేయడానికి 28 నెలల గడువు ఇచ్చారు. అంతవరకు కొత్త జోన్ అధికారులు కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి వీఎంఆర్‌డీఏ సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన 'డెక్'లో ఆరు, ఏడు అంతస్థులను అద్దెకు తీసుకున్నారు. అక్కడ ఫర్నీచర్ వర్కులన్నీ పూర్తయిపోయాయి. సుమారు అర డజను మంది అధికారుల నియామకం కూడా జరిగింది. ఓఎస్‌డీ, సీపీఓ తదితరులు జోనల్ కార్యాలయం పనులు పర్యవేక్షిస్తున్నారు. మిగిలినవారు పని చేయాలంటే...తూర్పు కోస్తా జోన్ నుంచి దక్షిణ కోస్తాను విడదీయాలి. దీనికి గెజిట్ నోటిఫికేషన్ అవసరం. అది రానంత వరకూ తూర్పు కోస్తా పెత్తనమే ఉంటుంది. ప్రస్తుతం అదే నడుస్తోంది. కొత్త జీఎం సందీప్ మాథుర్ మాట ఎవరూ ... మిగతా 6వ పేజీలో

ఏయూ మాజీ వీసీకి జైలు శిక్ష

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఒకరికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం వర్సిటీలో హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే...బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్టు)గా పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ నూకన్నదొరను అప్పటి ఉన్నతాధికారులు ఆరోపణలు వచ్చాయంటూ విధుల నుంచి తొలగించారు. దీనిపై వర్సిటీ అధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో దొర హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు...దొరను ఉద్యోగంలో కొనసాగించాలని 2023లో తీర్పు ఇచ్చింది. అయితే, కోర్టు ఇచ్చిన తీర్పును వర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. ఆయన్ను విధుల్లోకి తీసుకోలేదు. తీర్పును అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు అప్పటి వైస్ చాన్సలర్‌ను స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అయినప్పటికీ కోర్టుకు హాజరుకాకపోవడంతో బెయిల్‌బుల్ వారెంట్‌ను ఈ ఏడాది ఆగస్టులో కోర్టు జారీ చేసింది. కోర్టు ఆర్డర్ అందలేదన్న కారణాలను చూపించి తప్పించుకునే ప్రయత్నం చేసిన విషయాన్ని కోర్టు దృష్టికి బాధితుడు తీసుకువెళ్లడంతో తాజాగా గురువారం జరిగిన వాదనల అనంతరం నెలరోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇదిలావుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బాధితుడైన ఉద్యోగిని విధుల్లోకి తీసుకున్నారు.

భువనేశ్వర్-హైదరాబాద్ ప్రత్యేక రైలు కొనసాగింపు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా హైదరాబాద్-భువనేశ్వర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులను కొనసాగిస్తామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 07165 నంబరు గల రైలు డిసెంబరు 2 నుంచి జనవరి 27 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.30గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదేరోజు సాయంత్రం 5.15గంటలకు భువనేశ్వర్ వెళుతుంది. తిరుగు ప్రయాణంలో 07166 నంబరు గల రైలు డిసెంబరు 3 నుంచి జనవరి 28 వరకు ప్రతి బుధవారం రాత్రి 11.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదేరోజు రాత్రి 10 గంటలకు హైదరాబాద్ వెళుతుంది.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

గందరగోళం లేకుండా రీసర్వే జరగాలి

- ఆ ప్రక్రియ పూర్తయిన భూములకు మ్యుటేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు నిర్దేశం
- జమాబందీ విధానాన్ని పునఃప్రారంభించాలన్న కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే కొణతాల
- జిరాయితీ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలని కోరిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):
పదేపదే తలెత్తుతున్న భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కూడిన కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఫిర్యాదుల కమిటీ అధికారులతో నిర్వహించిన సమీక్షకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమగ్ర ... మిగతా 6వ పేజీలో

నలుగురు ఎస్ఐల బదిలీ

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

వ.నం పేరు	ప్రస్తుతం	బదిలీ
1. లంబ శ్రీనివాసరావు	దువ్వాడ	ద్వారకా క్రైమ్
2. ఎస్.సంతోష్‌కుమార్	త్రీటౌన్	ద్వారకా
3. సిరిపురపు రాజు	ద్వారకాక్రైమ్	త్రీటౌన్
4. జె.ధర్మేంద్ర	ద్వారకా	దువ్వాడ

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



సింహాచలంలోని వరాహ పుష్కరిణిలో దీపాలు వదులుతున్న భక్తులు

పోలిపాడ్యమి పర్వదినాన్ని జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి, కార్తీక దామోదరుడికి దీపాలను సమర్పించారు. - వార్త 8వ పేజీలో

మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం



కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం మార్గశిరమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 19 వరకు జరుగున్నాయి. తొలిరోజు పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు - 8లో



ధర్మ ప్రచార సభలో పాల్గొన్న గురుస్వాములు

లక్ష్మీపురంలో అయ్యప్ప ధర్మ ప్రచార సభ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం అయ్యప్ప సేవా పీఠంలో శుక్రవారం అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ప్రచార సభ జాతీయ కార్యదర్శి గాడు తాతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శంకరాచార్యులు అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథులుగా ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు కె. అయ్యప్పదాసు, శబరిమలై ప్రధాన అర్చకుడు ప్రవీణ్ నంబూద్రి హాజరయ్యారు. అయ్యప్ప దీక్ష చేస్తున్న వారికి హిందూ సనాతన సంప్రదాయం ఆచార వ్యవహారాల గురించి ముఖ్య అతిథులు వివరించారు. అనంతరం నిర్వాహకులు 18 ఏళ్లుగా శబరిమలై యాత్ర చేసిన 50 మంది గురుస్వాములకు గురు పురస్కార్ అవార్డులను అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార సభ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, గురునాథ్ పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు భీమిలి విద్యార్థి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలకుద్దు కేథరిన్ విద్యా సంస్థలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న విక్రాంత్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. విక్రాంత్ అండర్ 19 విభాగంలో శ్రీకాకుళంలో ఈనెల 19న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. వచ్చే నెల మహారాష్ట్రలో జరిగే అండర్ -19 జాతీయ క్రికెట్ పోటీలకు హాజరుకానున్నట్టు విద్యార్థి తెలిపాడు.

కార్మిక నేత చిల్ల శంకరరెడ్డికి నివాళి

తగరపువలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మిక సంఘం నాయకుడు చిల్ల శంకరరెడ్డి 36వ వర్ధంతి సభను తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు కైలాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.

5, 6, 98వ వార్డుల సమస్యలపై వినతి

మధురవాడ/కొమ్మాది/సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక కోరారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కె2 కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, కొమ్మాదిలో వంద అడుగుల బీటీ రోడ్డు నిర్మించాలని, 38వ సచివాలయం పరిధిలో ఉన్న పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే కె2, కె3 కాలనీ ఇళ్లకు ఇంటి పన్ను వేయించ డంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కూడా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. శివశక్తినగర్, నగరంపాలెం, రేవళ్లపాలెం ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రహదారులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కొండవాలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే స్పందించాలన్నారు. 98వ వార్డు కార్పొరేటర్ వరాహ నరసింహం కూడా ఆ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ప్రియాగార్డెన్స్‌లో డ్రైనేజీలు, బీఆర్‌టీఎస్‌లో ప్రధాన కూడళ్ల సుందరీకరణ, సూర్యకాంత్ లేఅవుట్ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.

సముద్రపు నాచుకు గిరాకీ

భీమునిపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట తీరంలో మత్స్యకార మహిళల ఆర్థికాభివృద్ధికి నూతనంగా ఏర్పాటు చేసిన సీవీడ్ కల్చర్ రాఫ్టాలను రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ శ్రీరామ్ శంకర్ నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు మాట్లాడుతూ చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ. 5. 5 లక్షలతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్‌లో సీ వీడ్ జ్యూస్‌కు డిమాండ్ ఉన్నందున, భీమిలి, విశాఖలో ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గరికిన కింగ్, కారి అప్పారావు, చీపుళ్ళ శ్రీనివాస్, బీజేపీ నాయకులు వాసుపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న దేవేరుల తిరువీధి

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవేరుల తిరువీధి ఉత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. సాయంత్రం చతుర్భుజి తాయార్, సింహవల్లీ తాయార్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి, విద్వాంసుల నాదస్వరాలపనలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు.

27న ఉక్కు కార్మికుల మహాధర్నా

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉత్పత్తి ఆధారిత జీతాల చెల్లింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఉక్కు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ఈనెల 27న ప్లాంటు పరిపాలన భవనం ఎదుట మహా ధర్నా చేపడతామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్ ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

విద్యతోనే మత్స్యకారుల అభ్యున్నతి

భీమునిపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల భవిష్యత్తు మారాలంటే విద్య ఒక్కటే మార్గమని ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్. సూరప్పడు అన్నారు.శుక్రవారం నాలుగో వార్డు చొక్కవానిపాలెంలో ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నర్సింగరావు కేక్ కట్ చేసి, మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు చొక్కా భాస్కరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

రైల్వే జోన్‌కు ఇంకా రెడ్ సిగ్నలే...

... 5వ పేజీ తరువాయి

వినడానికి లేదు. ఆదేశాలు పాటించాల్సిన బాధ్యతా లేదు.

ఆగస్టు 15, దసరా అయిపోయాయి

దక్షిణ కోస్తా జోన్ గెజిట్ నోటిఫికేషన్ కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్ ఢిల్లీ వెళ్లి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మాట్లాడారు. గెజిట్ విడుదల చేస్తామన్నారు. ఆగస్టు 15న వస్తుందని భావించారు. రాలేదు. ఆ తరువాత విజయదశమికి ఇస్తారని అనుకున్నారు. అదీ దాటిపోయింది. నవంబరులో వచ్చే అవకాశం ఉందన్నారు. అదీ లేదు. ఇప్పుడు జనవరి 2026 అంటున్నారు.

ఎంత ఎంపీలను కలిసినా ...

- చలసాని గాంధీ, రైల్వే యూనియన్ నాయకులు

దక్షిణ కోస్తా జోన్‌కు గెజిట్ విడుదల కోసం ఢిల్లీలో డిమాండ్ చేయాలని ఉత్తరాంధ్రాకు చెందిన ఎంపీలందరినీ కలిశాము. అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అరకు ఎంపీ తనూజరాణి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశాము. ఫలితం లేదు. తూర్పు కోస్తా రైల్వే అధికారులకు విశాఖను వదులుకోవడం ఇష్టం లేదు. అందుకే ఈ తాత్సారం. గెజిట్ రాకుండా జోన్ ఆపరేషన్ అసాధ్యం. దీనికి సీఎం చంద్రబాబునాయుడే చొరవ తీసుకోవాలి. ఈసారి ఢిల్లీ వెళ్లినప్పుడు దీనిపై గట్టిగా అడగాలి. అప్పుడే సాధ్యమవుతుంది.


కుమ్మరిపాలెం వద్ద పాడైన రహదారి


తాళ్లవలస సమీపంలో రోడ్డు దుస్థితి

అత్యంత దారుణంగా రహదారులు

- కుమ్మరిపాలెం - తాళ్లవలస రోడ్డు పొడవునా గోతులు
- వాహనదారులకు నరకయాతన

భీమునిపట్నం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు నుంచి తాళ్లవలస వెళ్లే రహదారి గోతులతో అత్యంత దారుణంగా ఉంది. చిన్నబజారు నుంచి యాతకుమ్మరిపాలెం, యాతపేట మీదుగా తగరపువలస - ఆనందపురం జాతీయ రహదారి చేరుకోవడానికి ప్రజలు ఈ రోడ్డు ను వినియోగిస్తుంటారు. ఇక్కడి నుంచి దొరతోట మీదుగా జాతీయ రహదారి చేరుకోవడానికి తొమ్మిది కిలోమీటర్లు కాగా బ్యాంక్ కాలనీ మీదుగా తగరపువలస చేరుకోవడానికి ఆరు కిలోమీటర్లు. అదే కుమ్మరిపాలెం రహదారిలో అయితే కేవలం నాలుగున్నర కిలోమీటర్లలోపే హైవేకు చేరుకోవచ్చు. దీంతో ఎక్కువ మంది వాహనదారులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుం టారు. అంతేకాకుండా సంగివలస, తాళ్లవలస జాతీయ రహదారిలో పలు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండడంతో బస్సులు ఎక్కువగా ప్రయాణిస్తుంటాయి. భీమిలిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వెళ్లేవారు కూడా ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. దీంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు 3 కిలోమీటర్లు జీవీఎంసీ పరిధిలోను, 1200 మీటర్లు భీమిలి మండల పరిషత్ పరిధిలోనూ ఉంది. చిన్నబజారు నుంచి డంపింగ్ యార్డు వరకూ జీవీఎంసీ పరిధిలోకి రాగా చిన్నివారి చెరువు నుంచి జాతీయ రహదారి వరకూ మండల పరిధిలోకి వస్తుంది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తిగా గోతులతో నిండిపోయింది.ఒమ్మివారి కల్లాలు నుంచి డంపింగ్‌యార్డు వరకూ జీవీఎంసీ ఇటీవల కొంత మేరకు మరమ్మతులు చేపట్టడంతో కొంత భాగం బాగుంది.


చిన్నాపురం జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి

త్వరలోనే పనులు చేపడతాం

ఈ విషయమై భీమిలి జోన్ పబ్లిక్ వర్క్స్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో రహదారి నిర్మాణానికి రూ. కోటి 70 లక్షలతో ప్రతిపాదించి టెండర్లు పిలిచామని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. మండల పరిషత్ ఏఈ పట్నాయక్‌తో మాట్లాడగా, మండల పరిధిలో ఉన్న రహదారి నిర్మాణానికి రూ. 20 లక్షలతో ప్రతిపాదనలు చేశామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

అమ్మో.. చిన్నాపురం రోడ్డా..?

పద్మనాభం : మండలంలోని చిన్నాపురం జంక్షన్-పద్మనాభం-శొంఠ్యాం ఆర్అండ్‌బీ రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు మరింత ఛిద్రంగా మారాయి. గతుకుల రోడ్డులో ప్రయాణాల వల్ల తరచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయి. చిన్నాపురం జంక్షన్ నుంచి రెడ్డిపల్లి సినిమా హాలు వరకు, రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకు నుంచి శేరిఖండం వరకు పద్మనాభం జంక్షన్ నుంచి బాకురుపాలెం వరకు పది కిలోమీటర్ల నిడివి గల రోడ్డంతా గోతులతో అధ్వానంగా ఉంది. ప్రభుత్వం గుంతలు లేని రోడ్లుగా మార్చాలని నిధులు మంజూరు చేసినా ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డును పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులే గుంతలను తాత్కాలికంగా పూడ్చే పనులు చేపడుతున్నారు తప్పితే ఆ శాఖాధికారులు కనీసం తట్టమట్టి కూడా వేయడం లేదు. రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ రోడ్డు పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే మిగిలిన గ్రామీణ రోడ్ల దుస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి

భీమునిపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ భక్తులు పోలి పాడ్యమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున భీమునిపట్నంలోని గోస్తనీ సాగర సంగమం ఒడ్డున మహిళలు దీపాలు వదిలారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు భీమిలి పరిసర గ్రామాల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే ఉప్పుటేరుకు చేరుకున్నారు. ఉప్పుటేరు వద్ద పూజలు చేసి, అరటి డొప్పల్లో దీపాలు వదిలారు. నాలుగున్నర నుంచి భక్తుల సంఖ్య క్రమంగా పెరగడంతో ఉప్పుటేరు వద్ద ఆధ్యాత్మికత వాతావరణం ఏర్పడింది. కొందరు ఇసుక తిన్నెల్లో సైకత శివలింగాలను చేసి పసుపు, కుంకుమ పెట్టి పూజలు చేశారు. అనంతరం అరటి దవ్వలలో దీపాలు వెలిగించి ఉప్పుటేరులో వదులుతూ పోలిని తలుచుకుని దీపాలకు దండం పెట్టారు. ఉదయం ఎనిమిది గంటల వరకూ భక్తులు ఉప్పుటేరుకు వస్తూనే ఉన్నారు.కాగా, తెల్లవారుజామున మూడు గంటల నుంచే లా అండ్ ఆర్డర్ పోలీసులు, మెరైన్ పోలీసులు, నాలుగు గంటల నుంచి జీవీఎంసీ శానిటేషన్ ఉద్యోగులు ఉప్పుటేరు వద్ద విధులు నిర్వర్తించారు.


భీమిలి ఉప్పుటేరులో దీపాలు వదులుతున్న భక్తులు

మధురవాడ : కార్తీక మాసం పూజలు చేసిన భక్తులు పోలిపాడ్యమి పురస్కరించుకుని దీపాలను నీటిలో వదలారు. మధురవాడ, నగరంపాలెం, మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ ప్రాంతాలకు చెందిన మహిళలు తగరపువలస గోస్తనీ నదికి వెళ్లి అరటి డొప్పల్లో కార్తీక దీపాలను విడిచిపెట్టారు.

అష్టలక్ష్మీ దేవాలయంలో మార్గశిర మాసోత్సవాలు

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం నుంచి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 1న గీతా జయంతి, 3న హనుమత్ వ్రతం, 4 మార్గ పౌర్ణమి, 16న ధను సంక్రమణం జరుగుతాయన్నారు.

ఉపాధ్యాయులతో ఆర్‌జేడీ సమావేశం

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణ సాధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ సూచించారు. శుక్రవారం ఆయన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వాహనాల తనిఖీ

విశాలాక్షినగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెం తీరం వద్ద మెరైన్ పోలీసులు,లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేప ట్టారు. సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కోస్టల్ సెక్యూరిటీ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తడి, పొడి చెత్త సేకరణపై శిక్షణ

ఆనందపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వెల్లంకి పంచాయతీలో హరిత రాయబారులకు సంపద తయారీ కేంద్రం వద్ద సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ చెత్త సేకరణలో అలసత్వం వహించరాదని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు,ఎంపీడీవో డాక్టర్ జానకి, పంచాయతీ విస్తరణాధికారి సత్యన్నారాయణ, ఎస్ఐఆర్‌డీ ప్రతినిధి నాగరాజు, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి

పద్మనాభం : పద్మనాభంలో స్థానికీకరించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకటైన థీమ్-5 పచ్చదనం-పరిశుభ్రతపై హరితరాయబారులకు శిక్షణ ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన హరిత రాయబారులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్తతో వానపాము ఎరువు తయారీ, పొడి చెత్తను వేరుచేసి వివిధ కంపార్ట్‌మెంట్లలో ఉంచడం వంటి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలి డీఎల్‌డీఓ నిర్మలాదేవి, ఎంపీడీఓ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు

తగరపువలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పించనున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి. ఆదిశేషు తెలిపారు. శుక్రవారం ఆయన తగరపువలసలో ఉత్తరాంధ్ర రీజినల్ ఛాంబర్ ఆఫ్ కామర్సు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత ప్రాజెక్టులతో సంప్రదిస్తే పరిశ్రమల ఏర్పాటుకు సాంకేతిక సహాయం, రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. విద్యుత్ కూడా రాయితీపై అందిస్తామన్నారు. చిట్టివలస ఎస్‌బీఐ మేనేజరు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వల్ప పెట్టుబడి, వ్యాపారం పట్ల ఆసక్తి, మార్కెటింగ్‌పై అవగాహన ఉంటే తాము రుణాలు అందిస్తామని చెప్పారు. ఛాంబర్ ఆఫ్ కామర్సు ఛైర్మన్ దేవరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులకు కేంద్రం ద్వారా ఎలక్ట్రికల్ ఆటోలను రాయితీపై అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఆటోల తయారీ కేంద్రం ప్రతినిధి సత్యనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్సు డిప్యూటీ మేనేజరు గోపాలకృష్ణ, నార్త్ ఆంధ్ర సమన్వయకర్త అప్పలరాజు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

భూసర్వే, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు అభ్యంతరాల స్వీకరణ, తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీసర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి గ్రామ సభలు విధిగా నిర్వహించి ప్రక్రియను సజావుగా చేపట్టాలని స్పష్టంచేశారు. రైతుల సమక్షంలో ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. అశాంతికి, గందరగోళానికి తావులేకుండా రీసర్వే చేయాలని, ఒకవేళ వివాదాలు తలెత్తితే ఇరుపక్షాల సమక్షంలో పరిష్కార చర్యలు చేపట్టాలని, అనివార్యకారణాలతో ఒక వర్గం రాకపోతే మరో అవకాశం ఇవ్వాలని, అప్పటికీ రాకపోతే సుమోటోగా తీసుకుని నిబంధనలకు అనుగుణంగా అధికారులు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టం చేశారు. రీసర్వే అయిన భూములకు మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాల పరిష్కారానికి గడువు రెండేళ్లకు పెంచాలని కమిటీ అభిప్రాయపడిందని రఘురామకృష్ణరాజు అన్నారు. దీన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లి ఆచరణలో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ ప్రతిపాదించిన అంశాలలో దీన్ని ప్రధానంగా చేర్చాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రైతుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా స్థాయి అధికారి నుంచి వీఆర్వో వరకు ఏడాదికి ఒకసారి గ్రామాల్లో అందుబాటులో ఉండేలా జమాబందీ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని సూచించారు. భూఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ భూములు రీసర్వే చేసినప్పుడు కొన్నిచోట్ల జిరాయితీ భూములు 22-ఎలో పెట్టారని పేర్కొంటూ అటువంటి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. గంభీరంలో సర్వేనంబరు 228-4లో ఒక వ్యక్తి కొనుగోలు చేసిన జిరాయితీ భూమిని 22-ఎలో పెట్టారని పేర్కొంటూ ఇటువంటివి చాలా ఉన్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకర్మాగారం పరిధిలో ఆర్.కార్డులు పొందిన వారిలో 472 మంది ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికంగా ఉన్న విమల విద్యాలయం పరిస్థితిని ప్రస్తావించి సమస్య పరిష్కరించాలన్నారు. ఉక్కు కర్మాగారం పరిధిలో ఉన్న బస్ డిపో, గంగవరం మత్స్యకారులకు జట్టీ నిర్మాణం, ఏపీఐఐసీ లేఅవుట్, అపెరల్ పార్కును 22-ఎ నుంచి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో శాసనసభా డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సర్వే విభాగం డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు సంగీత్‌మాథుర్, సుధాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పెద ఉప్పాడలో రూ. 1.39 కోట్లతో చేపట్టనున్న బహుళార్థక సాధక కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మత్స్యకారులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చేపల తిమ్మాపురంలో ది విశాఖపట్నం టౌన్ ఫిషర్ ఉమెన్ డ్రైఫిష్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్స్యకారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఏడాదికి రూ. 20 వేలు చొప్పున 12,130 మందికి రూ. 25 కోట్లు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల బోట్లకు డీజిల్ లీటర్‌కు రూ. 9 రాయితీ, వేట సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం, 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పింఛను అందిస్తున్నామని తెలిపారు. అంతకుముందు పెద ఉప్పాడలో రూ. 1.39 కోట్లతో చేపట్టనున్న బహుళార్థక సాధక కేంద్రానికి, చేపలు ఆరబెట్టే 7 ప్లాట్ ఫారాల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే చేపల తిమ్మాపురంలో మత్స్యకారులకు 26 ఔట్ బోట్ ఇంజన్లు, 80 మందికి జీపీఎస్ సెట్‌లు, 50 మందికి వాకీటాకీలు పంపిణీ చేశారు. మంగమారిపేట తీరంలో 30 మందికి రూ. 6 లక్షల విలువైన సీవీడ్ రాఫ్ట్ అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు మారుపల్లి పార్వతమ్మ, కార్యదర్శి మైలపల్లి ఎర్రమ్మ, కన్వీనరు మారుపల్లి అమరనాథ్, పిసి అప్పారావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, భీమిలి జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు, తహశీల్దార్ పైల రామారావు, 8వ వార్డు కార్పొరేటర్ అప్పారావు పాల్గొన్నారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

సభ్యులు తమ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా 'జీరో అవర్' కింద ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తానని, సభ్యులంతా సీట్లలో కూర్చోవాలని మేయర్ కోరారు. దీంతో వైసీపీ, సీపీఎం సభ్యులు ఆందోళన విరమించి తమ సీట్లలో కూర్చున్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు వెచ్చించి చేసే పనులకు కార్పొరేటర్లు ప్రతిపాదనలు ఇస్తారని, కానీ అజెండాలో 44 పనులను ఎమ్మెల్యే ప్రతిపాదించినట్టు పేర్కొనడం చూస్తుంటే కౌన్సిల్ ఏకంగా అసెంబ్లీగా మారిపోయిందనే భావన కలుగుతోందన్నారు. జీవీఎంసీ నిధులతో వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగితే వారి గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక మార్కెట్ ఆశీలు రూ.1.8 కోట్లకు పాడిన కాంట్రాక్టర్ తర్వాత టెండరు రద్దుచేసుకున్నారని, అయినా అదే కాంట్రాక్టర్‌తో అధికారులు ఆశీలు వసూలుచేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో రాష్ట్రప్రభుత్వానికి ఉన్న 10.5 శాతం వాటాను వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీకి అమ్మేశారని, అప్పుడు మాట్లాడని వైసీపీ సభ్యులు ఇప్పుడు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంటూ మొసలికన్నీరు కార్చుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు.

అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగా నగరంలో వీధిదీపాల కాంట్రాక్టు దక్కించుకున్న బీఎస్ఆర్ సంస్థ పనితీరుపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ 196 మంది టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ పది శాతం మందితోనే నెట్టుకురావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై ఏకరువుపెట్టారు. ముడసర్లోవ, గాజువాక సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణ చూస్తున్న 'రాశా' సంస్థ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేయాలని కమిషనర్ ఆదేశించినా ఇంతవరకూ అధికారులు పట్టించుకోకపోవడం, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్వహణ కాంట్రాక్టరే చూడాల్సి ఉన్నా,రిఫర్బిష్‌మెంట్ పేరుతో రూ.50 లక్షల చొప్పున జీవీఎంసీ నిధులు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించడం చూస్తుంటే కాంట్రాక్టర్‌తో మిలాఖత్ అయ్యారనే విషయం తేటతెల్లమవుతోందన్నారు.76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనవార్డులో ఉన్న సీసీఎస్ ప్రాజెక్టు సరిగా పనిచేయకపోయినా, కాంట్రాక్టర్ బిల్లులు పెడితే అధికారులు తిరస్కరించకపోవడం దారుణమన్నారు.

క్లాప్ వాహనాలను నిర్వహిస్తున్న దుర్గా కన్సల్టెన్సీ సరిగా పనిచేయడం లేదని తొమ్మిది నెలలు కిందటే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కౌన్సిల్ తీర్మానం చేస్తే ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ దుర్గా కన్సల్టెన్సీపై ఫిర్యాదులు రావడం వల్లనే క్లాప్ వాహనాల లోడర్ల జీతాలు చెల్లింపు బాధ్యతలను ఆ సంస్థ నుంచి తొలగించి మహిళాసంఘాలకు అప్పగించామన్నారు. సభ్యులు కోరితే జోన్‌ల వారీగా లోడర్లు నియామకాలకు టెండరు పిలుస్తామన్నారు. యాదవ సామాజిక భవనం కోసం చినగదిలి వద్ద 0.50 భూమి కేటాయింపు అంశంపై ఆ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ, బీజేపీ, టీడీపీకి చెందిన కొందరు అభ్యంతరం తెలిపారు. తమకు ఇప్పటికే ఎండాడ వద్ద స్థలం కేటాయించారని, ఇప్పుడు మరోసారి చినగదిలి వద్ద స్థలం కేటాయింపు ప్రతిపాదన పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో కేటాయింపులతో కౌన్సిల్‌కు సంబంధం లేదని, తాజా ప్రతిపాదన ప్రకారం స్థలం కేటాయింపునకు ఆమోదం తెలుపుతున్నట్టు మేయర్ ప్రకటించారు. స్మార్ట్ వెండింగ్ జోన్ కింద వీఎంఆర్‌డీఏ సెంట్రల్‌పార్కు చుట్టూ దుకాణాల ఏర్పాటుపై కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అభ్యంతరం తెలిపారు. ఆ స్థలాన్ని వీఎంఆర్‌డీ ఇప్పటికే కొన్ని సంస్థలకు లీజుకు ఇచ్చేసిందని చెప్పగా, కమిషనర్ జోక్యంచేసుకుని ఏదైనా సమస్య ఉంటే మరోచోట ఏర్పాటుచేస్తామని చెప్పారు. నగరంలోని 88 కిలోమీటర్ల ప్రధాన రహదారులను పీపీపీ కింద పదేళ్లపాటు ప్రైవేటు సంస్థ నిర్మించి, నిర్వహించుకునేలా ప్రతిపాదించిన అంశంపై సీపీఎం, వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని పట్టుబట్టారు. దీనికి కమిషనర్ వివరణ ఇస్తూ కేరళ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో ఈ విధానం ఉందని, కేవలం రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఉండేందుకే ఈ విధానం అమలు చేస్తున్నామని, కాంట్రాక్టర్‌కు ఒకేసారి బిల్లు ఇవ్వకుండా విడతల వారీగా పదేళ్లపాటు చెల్లిస్తామని, దీనివల్ల రోడ్డు దెబ్బతింటే బిల్లు నిలుపుదల చేస్తారనే భయంతో కాంట్రాక్టర్ నాణ్యతాలోపం లేకుండా రోడ్డునిర్మాణం చేస్తారని వివరించారు. ముడసర్లోవ వద్ద రైల్వే శాఖకు కేటాయించిన భూమిలో కొందరు ఆక్రమణదారులు ఉన్నందున వారిలో 47 మందికి జీవీఎంసీ ఆధీనంలో ఉన్న భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. జీవీఎంసీకి చెందిన భూమిలో ఎవరూ ఆక్రమణదారులు లేరని, తప్పుడు పేర్లు పెట్టి జీవీఎంసీ భూమిని కొట్టేసేందుకు ఎత్తుగడ వేస్తున్నారని అభ్యంతరం చెప్పారు. దీనిపై తహశీల్దార్ పాల్‌కిరణ్ వివరణ ఇస్తుండగానే ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు ప్రకటించి మేయర్ పోడియం దిగి వెళ్లిపోవడంతో కార్పొరేటర్లు, కమిషనర్‌తోపాటు అధికారులు సైతం అవాక్కయ్యారు.

అంతర్గత రహదారులు అధ్వానం

... 5వ పేజీ తరువాయి

గోతులు తవ్వుతున్నారు. వాటిపై మట్టి పోసి వెళ్లిపోతున్నారు. వర్షాలకు అది కుంగిపోతోంది. ఆ మార్గాల్లో తారురోడ్లకు నిధులు మంజూరు చేస్తే ఆ గోతులను సరిచేయకుండా వాటిపైనే నిర్మాణం చేపడుతున్నారు. దీంతో అవి వారం రోజులకే కిందికి దిగిపోతున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తుంటే ఇంజనీరింగ్ అధికారులు కళ్లు మూసుకొని వాటికి బిల్లులు మంజూరు చేస్తున్నారు. బీచ్ రోడ్డులో సైతం పక్షపాతం చూపిస్తున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వైపు రోడ్డును చక్కగా నిర్వహిస్తూ ఫిషింగ్ హార్బర్ వైపు మార్గం గోతులు పడినా పూడ్చడం లేదు. వీటిపై జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ అసలు లేదు. పారిశుధ్యం కోసం వీధుల్లో తిరిగే అధికారులు చెత్తను చూస్తున్నారే తప్ప పాడైన రహదారులను పట్టించుకోవడం లేదు. రహదారులపై జీవీఎంసీ ఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అవన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది.

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం



బీచ్ రోడ్డు : రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి

» గోతులమయంగా రహదారులు » ఏళ్ల తరబడి చేపట్టని మరమ్మతులు » యూజీడీ తవ్వకాలతో పలు చోట్ల ఛిద్రమైన రహదారులు

తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రహదారులు దారుణంగా తయారయ్యాయి. కొన్నేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడం, యూజీడీ పనుల పేరుతో ఎక్కడికక్కడే తవ్వేకాలు చేపట్టి సరిగా పూడ్చకపోవడం, గోతులమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. వీటి గురించి ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రహదారులపై రాకపోకలు సాగించలేకపోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు గురవడం, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కనీస మౌలిక సదుపాయాల కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉంటే ఎలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ వెళ్లే మార్గం నిండా గోతులతో నిండిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల రహదారిలో ప్రయాణించడ వల్ల వాహనాలు పాడవడమేకాకుండా శరీరం ఇబ్బందికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.

ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ వెళ్లే మార్గంలోని గోతుల దుస్థితి. వాహనచోదకులు ఆటోమోటివ్ సిగ్నల్, ఇసుకతోట సిగ్నల్‌లను తప్పించుకునేందుకు, ట్రాఫిక్‌ను అధిగమించి త్వరగా గమ్యస్థానాన్ని చేరుకునేందుకు ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయ బొమ్మ వద్ద జాతీయ రహదారి పైకి వాహనదారులు చేరుకోవచ్చు. దీనివల్ల వారికి ట్రాఫిక్, సమయం కూడా ఆదా అవుతుంది. కానీ ఈ మార్గంలో ఎక్కడ చూసినా గోతులే కనబడుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 16వ వార్డు కార్యాలయం వద్ద రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. చీకటి సమయంలో ఈ మార్గంలో విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా వెలగకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణా కళాశాల మెయిన్ గేటు వద్ద పైపులైన్ కోసం తవ్వారు, కానీ ఆ ఆ తర్వాత సరిగ్గా పూడ్చలేదు. అదే మార్గంలో ఎలియన్స్ కళాశాల వద్ద ఇటీవల వర్షానికి పడిన గోతుల్లో స్థానికులు తాత్కాలికంగా రాళ్లు వేసుకున్నారు. అదే విధంగా ఎస్‌బీఐ ఎదురుగా మ్యాన్‌హోల్ వద్ద ఏర్పడిన గొయ్యి వాహనచోదకుల నడుములను విరగగొడుతోంది. ఇదే వార్డులోని ఎంఎంటీసీ కాలనీ, ఎల్‌ఐసీ అపార్టుమెంటు వెనుక భాగంలో వినాయక ఆలయం వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి దాదాపు నాలుగు నెలలు గడిచింది. కానీ ఇంతవరకూ ఆ గోతులను సంపూర్ణంగా మూసివేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు సమస్యపై దృష్టి సారించి గోతులను పూడ్చివేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



వెంకోజీపాలెం : కృష్ణా కళాశాల వద్ద ఛిద్రమైన రోడ్డు

బీచ్‌రోడ్డులో..

బీచ్ రోడ్డు : ఫిషింగ్ హార్బర్ వద్ద పలు రహదారులు దారుణంగా మారాయి. అధ్వానంగా మారిన రోడ్లపై నిత్యం అవస్థలు పడుతూ జనం ప్రయాణించాల్సి వస్తోంది. రోజులు, వారాలు కాదు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల పైప్‌లైన్, యూజీడీ పనులు నిమిత్తం రహదారులను తవ్వేశారు. ఆ పనులు పూర్తయినా గోతులను మాత్రం పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కాలం నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో కంకర రాళ్లు రోడ్డంతా తేలిపోయి మట్టి రోడ్డు కంటే దారుణంగా పరిస్థితి తయారైంది. రోడ్డుపై నడవడానికి కూడా వీలు లేకుండా రాళ్లు వ్యాపించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బీచ్‌రోడ్డు : ఫిషింగ్ హార్బర్ వద్ద రాళ్లు, మట్టి తేలిన రోడ్డు



వెంకోజీపాలెం : ఎస్‌బీఐ వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ఆరిలోవ : గతుకులమయంగా పెదగదిలి-విమ్స్ సర్వీసు రోడ్డు

ఆరిలోవలో..

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై ఎక్కడా చూసినా గోతులే కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతూ గాయాల పాలవుతున్నారు. పెదగదిలి జంక్షన్ నుంచి విమ్స్ వరకు ఉన్న సర్వీసు రోడ్డు పూర్తిగా పాడైంది. ఆరిలోవ హెల్త్ సిటీలో గల సర్వీసు రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. చినగదిలి సాయిబాబా గుడి నుంచి ఆరిలోవ వెళ్లే రోడ్డు, అలాగే శ్రీకాంత్‌నగర్ లే అవుట్ రోడ్డు పూర్తిగా పాడయ్యాయి. సుమారు ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి నెల కొని ఉందని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్డు గుంతల్లో నీరు చేరి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు.

అలాగే జీవీఎంసి 13వ వార్డు రామకృష్ణాపురంలో కూడా రహదారులు ఛిద్రమయ్యాయి. ఈ ప్రాంతంలో అనేక చోట్ల యూజీడీ పనులు చేపట్టి తవ్వకాలు చేశారు. ఆ పనులు పూర్తయినా సరిగా పూడ్చకపోవడంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటేనే గుబులు చెందుతున్నారు. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారిపోతోందని, నడిచే పరిస్థితి కూడా ఉండని పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనిఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వెంకోజీపాలెం : ఎంఎంటీసీ ఎల్‌ఐసీ అపార్టుమెంటు వెనుక మార్గంలో అసంపూర్తిగా పూడ్చిన మార్గం

దారపాలెంలో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా

» హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ ఆక్రమణ
» పక్కా నిర్మాణాలు చేపడుతున్న కబ్జారాయుళ్లు
» పట్టించుకోని 'రెవెన్యూ'
» మీటర్లు సైతం మంజూరు చేస్తున్న విద్యుత్ శాఖ



సర్వే నెంబరు 15/12లో ఆక్రమణకు గురైన 400 గజాల ప్రభుత్వ భూమిలో వెలసిన రేకుల షెడ్డు

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల కొండ పోరంబోకు ప్రాంతంలో సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు రాజకీయ నేతల అండదండలతో ఈ తతంతం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలగా ఈ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా కబ్జా బాగోతం సాగుతోందని, అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం అర్థం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఆరు నెలల కిందట ఈ ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిలో సుమారు 19 హెచ్చరిక బోర్డులను రెవెన్యు సిబ్బంది ఏర్పాటు చేసింది. ఈ బోర్డులను తొలగించి మరీ కబ్జాదారులు రేకుల షెడ్డును నిర్మించడం గమనార్హం. స్థలాన్ని ఆక్రమించడమే కాదు షెడ్డులు, వివిధ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు కిక్కురుమనకపోవడం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ప్రాంతంలో గజం స్థలం సుమారు రూ.60 వేలు పలుకుతోంది. ఇక్కడ నిర్మించిన రేకుల షెడ్డుకు విద్యుత్ శాఖ అధికారులు మీటర్‌ను కూడా మంజూరు చేయడం గమనార్హం. సామాన్యులు ఇంటికి మీటరు కేటాయించమని దరఖాస్తు చేసుకుంటే, అంతా సక్రమంగా ఉన్నా సరే రోజుల తరబడి తిప్పించుకునే విద్యుత్ శాఖ అధికారులు, ఇలా ఆక్రమిత స్థలంలో చేపట్టిన నిర్మాణానికి మాత్రం వెనువెంటనే విద్యుత్ మీటర్ కేటాయించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు కార్యాలయంలో వద్ద పారిశుధ్య కార్మికులకు చీరలు, ఏకరూప దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో విశాఖ తూర్పు తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు ముగడ వాసు పాల్గొని పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ల శ్రీను, పల్లా బాబు, ఎన్.కొండలరావు, సత్య, వార్డు శుభ్రం మేస్త్రిలు నమ్మి చిన్నరాజు, జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే వెలగపూడి పరామర్శ



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల బీసీ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొండేటి ఈశ్వరరావు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు శుక్రవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదం గురించి ఆరా తీశారు. బాధితుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో నష్ట పరిహారం గురించి అంచనా వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. వెంటనే నష్టపరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శితో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త వేయవద్దు : కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి నగర సుందరీకరణను చెడగొట్టవద్దని 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి వార్డు ప్రజలకు హితవు పలికారు. శుక్రవారం ఆమె వార్డులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పలు చోట్ల గుట్టలుగా చెత్త పోస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆమె స్థానికులతో మాట్లాడుతూ చెత్తను జీవీఎంసీ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు అందించి సహకరించాలని సూచించారు. ఈ విధంగా చెత్తను వీధుల్లో పడేయడం వల్ల మన పరిసరాలను మనమే అధ్వానంగా చేసుకున్నవారమవుతామని పేర్కొన్నారు. ఈ విషయంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా మెలగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో చెత్త వేసే చోట దేవుడి చిత్రంతో కూడిన ఫ్లెక్సీలను ఉంచారు. ఈసారి ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధించడం జరుగుతుందనిహెచ్చరించారు.



చెత్త వేస్తున్న ప్రాంతంలో శుభ్రం చేయించి దేవుడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ మంగవేణి, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య(గోపాల పట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్యకిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 48, వంకాయలు (తెలుపు) 64, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 64, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 58, బీరకాయలు 60, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 28, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాత ది) 70, బరబాటి 60, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 36, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 80, గోరుచిక్కుడు 60, కూరపెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట)7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ముగిసిన కార్తీక మాసోత్సవ పూజలు




రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో దీపాలను వదులుతున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో శివనామస్మరణతో నిర్వహించిన కార్తీక మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పోలి పాడ్యమిని పురస్కరించుకొని మహిళలు తెల్లవారుజామునే మేల్కొని నెలంతా చేసిన 1001, 501, 108 ఒత్తులను ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కొలనులో అరటి దొప్పలపై ఉంచి వదిలారు. అనంతరం బ్రాహ్మణులకు వాయినాలను ఇచ్చారు. అలాగే పాతవెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో భక్తులు దీపాలను వదిలారు. అనంతరం ఆలయ అర్చకులకు వాయిణలను సమర్పించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి చెరువులు, ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనుల్లో దీపాలను విడిచిపెట్టారు. పెదగదిలిలో గల కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిన్న నీటి కొలనులో మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వేకువజామున అరటి డొప్పలపై (తెప్పలు) పసుపు కుంకుమ, అరటి పండ్లు, చలిమిడిని నివేదనగా సమర్పించి దీపాలను వెలగించారు. ఆ దీపాలను కొలనులో విడిచిపెట్టారు. అలాగే ఆరిలోవలోని బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర ఆలయంలో ఆలయం చీఫ్ ట్రస్టీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నీటి కొలనులో దీపాలను విడిచిపెట్టారు. అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయాన్ని అనుసరించి బ్రాహ్మణులకు వాయినాలు సమర్పించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ శ్రీవిద్య వినతిపత్రం



కమిషనర్‌ను వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులోని భీమిలి నియోజకవర్గానికి సంబంధించి కొండవాలు ప్రాంతంలో ప్రస్తుతం నిర్మిస్తున్న రక్షణ గోడల ఎత్తును 2 మీటర్లు పెంచాలని, మరిన్ని రక్షణ గోడలను నిర్మించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా కార్పొరేటర్ ఈ విషయమై ఆమె మాట్లాడారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. అదనంగా విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని, పారిశుధ్య సిబ్బందిని పెంచాలని, కాలువలు,రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

సత్యసాయి జయంతి వేడుకల్లో అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీలో గీతాలాపన చేస్తున్న వైష్ణవి, వాగ్దేవి

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయి బాబా నూరవ జన్మదినోత్సవాన్ని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంవీపీ కాలనీ ప్రేమసదన్‌లో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరిలో సినీ నేపథ్య వర్ధమాన గాయనీలైన అక్కచెల్లెళ్లు వైష్ణవి, వాగ్దేవీల కచేరి వీక్షకులను భక్తిపారవశ్యంలో ముంచింది. సాయంత్రం అయిదు గంటలకు వేద పఠనం, శ్రీసత్యసాయి అష్టోత్తర శతనామార్చన, యువజ విభాగం ఆధ్వర్యంలో నామ సంకీర్తన, పద్మశ్రీ డాక్టర్ యెల్లా వేంకటేశ్వరరావు శాస్త్రీయ సంగీత మృదంగం, భక్తి సంగీత కచేరీ, కేకు కటింగ్, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ లేబర్‌కోడ్స్‌పై సీఐటీయూ ఆందోళన

» గెజిట్ కాపీలను దహనం చేసి నిరసన



గెజిట్ కాపీలను దహనం చేస్తున్న సిటూ నాయకులు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ-లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికులకు ముప్పేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలుకు గెజిట్ జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జగదాంబజంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. కార్మికుల ద్రోహం చేసేలా చట్టాలను రూపొందించి అమలుచేస్తున్నాయన్నారు. ఈ-లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే యాజమాన్యాలకు సర్వాధికారాలు దక్కి, కార్మికులు బానిసలుగా మారుతారని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం ఈ-లేబర్‌కోడ్ గెజిట్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు.

మాస్టర్ ప్లాన్ పనులు వేగవంతం చేయాలి

» వీఎంఆర్డీ కమిషనర్ తేజ్ భరత్



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ తేజ్ భరత్

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ పనులను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానిస్తూ చేపట్టిన ఏడు రహదారుల నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ నేరెళ్లవలస- తాళ్లవలస, చిప్పాడ- పోలిపల్లి రహదారి పనులు గడువులోగా, నాణ్యత పాటించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. విమానాశ్రయం ప్రారంభించే సమయానికి ఎట్టి పరిస్థితుల్లో రహదారులు పూర్తి కావాల్సిందేనన్నారు. వీఎంఆర్డీఏ ప్రధానఇంజనీర్ వినయ్‌కుమార్, ముఖ్య ప్రణాళికాఅధికారి శిల్ప, ఇంజనీర్లు రామరాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం ఆరిలోవ 5వ సెక్టర్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదన్నారు. కార్తీక మాసంలో అన్నదానం చేయడం వల్ల మరింత ఫలితం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో స్థానికులు, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీ ఈఈ పొలాకి శ్రీనివాస్ తెలిపారు. నందగిరినగర్, చాకలిపేట, చెక్కుడురాయి బిల్డింగ్, రైల్వేన్యూ కాలనీ, హరగోపాల్ స్కూల్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాధవధార: మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి ఎన్ఏడి కొత్తరోడ్డు సమీపంలోని దుర్గాపురం, మాధవధార, అప్పయ్యనగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలు, కాకానినగర్‌తో పాటు ఎన్ఏడీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

జ్ఞానాపురం: కంచరపాలెం సెక్షన్‌లో జ్ఞానాపురం 33/11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శనివారం కాన్వెంటు కూడలి, జ్ఞానాపురం, ఫైడిమాంబ కాలనీ, ఎఫ్‌సీ గోదాం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని జోన్-2 ఈఈ బీకే నాయుడు కోరారు.

పసికందు మృతిపై ముమ్మర దర్యాప్తు

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం సంజీవయ్యకాలనీ మురుగుకాలువలో గురువారం పసికందును చంపి ముక్కలుగా పడేసిన ఘటనపై కంచరపాలెం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. మూడు బృందాలుగా ఏర్పడి ఘటన జరిగిన ప్రాంతంలో ఖాళీ స్థలాలు, పాడుబడిన భవనాలను శుక్రవారం తనిఖీ చేశారు. డ్రోన్ కెమెరాలతో పరిసరాలను పరిశీలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించి భిక్షాటన చేసే మహిళ చిత్రం గుర్తించినట్టు సమాచారం. పూర్తి ఆధారాలు లభ్యం కాకపోవడంతో సమగ్ర విచారణ చేస్తున్నట్టు తెలిపారు. అప్పుడే శిశువుకు జన్మనిచ్చిన మహిళ గర్భం నుంచి బయటకు వచ్చిన వ్యర్థాన్ని (మాయ) బట్టి చూస్తే...పుట్టిన వెంటనే శిశువును హత్య చేసి ముక్కలుగా కోసి పడేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో కేసును ఛేదించగలమని పోలీసులు భావిస్తున్నారు.

చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ మహిళలు



అధికార ప్రతినిధి అడుసుమిల్లి సురేష్‌తో భారత జట్టు చదరంగం క్రీడాకారిణులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫిడే ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ టోర్నీలో భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిందని భారత్ జట్టు అధికార ప్రతినిధి అడుసుమిల్లి సురేష్ తెలిపారు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నందిధా పి.వి., పద్మిని రౌత్, సవిత శ్రీ, శ్రీజ శేషాద్రి, వేల్పుల సరయు అద్భుతంగా రాణించి జట్టుకు క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చారని పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్‌లుగా వ్యవహరిస్తున్న స్వయంస్ మిశ్రా, సరితా రెడ్డి చక్కని సూచనలు చేస్తున్నారన్నారు. భారత మహిళల జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నీలో శిల్పజకు పతకం



విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా భారతి జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన కె.శిల్పజ రజత పతకం సొంతం చేసుకుంది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఆల్‌రౌండర్ ఈవెంట్‌లో శిల్పజ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. కోచ్ మనోవర్ వద్ద శిక్షణ పొందుతున్న శిల్పజ...స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ పోటీలకు నేరుగా ఎంపిక కావడం విశేషం. పతకం సాధించిన శిల్పజను శ్రీకృష్ణ విద్యామందిర్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

55వ వార్డు పరిధిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి పాత రామారావు ఆసుపత్రి సమీపంలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో సమస్యను స్థానికులు వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల క్రితం వాటిని అధికారులు పరిశీలించారు. శుక్రవారం రెండు నూతన విద్యుత్ స్తంభాలు వేశారు. దీంతో దీర్ఘకాలంగా స్థానికుల ఆందోళనకు కారణమైన సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ భరత్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుల దృష్టికి వార్డు టీడీపీ నాయకులు సమస్యను తీసుకెళ్లడంతో అధికారులు స్పందించారు. పనులను వార్డు కమిటీ ప్రతినిధులు రమణ అప్పారావు, మాజీ కార్పొరేటర్ ఎన్.అప్పారావు, కోటి, వెంకటరావు, యమున, జయప్రకాశ్ తదితరులు పర్యవేక్షించారు.

అధ్వాన రహదారులతో వాహనదారులకు అవస్థలు

సీతమ్మధార, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు చేపట్టినా, సీతమ్మధార, సీతంపేట ప్రాంతాల్లో ఇంకా పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తూ రాకపోకలకు ప్రాణసంకటంగా మారాయి. సీతంపేట ప్రధాన రహదారిలోని శ్రీకృష్ణ విద్యామందిర్ సమీపంలోనూ, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద గోతులు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ద్విచక్రవాహనదారులు ఈ మార్గంలో వెళ్లినప్పుడు నడుముపై భారం పడి అవస్థలు పడుతున్నారు. అదే విధంగా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మలుపులో రోడ్డు అధ్వానంగా మారి పెద్ద గొయ్యి పడింది. దీంతో అటుగా వాహనాలు మలుపు తిరిగినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. సీతమ్మధార టీపీటీ కాలనీ, గురుద్వార నుంచి సీతమ్మధార వైపు, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో మంచినీటి పైపులైన్లు, యూజీడీ కోసం రహదారులు తవ్వడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



సీతంపేట ప్రధాన రహదారిలో రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా పెద్ద గొయ్యి



శ్రీకృష్ణ విద్యామందిర్ సమీపంలో ప్రమాదభరితంగా గొయ్యి

లలితాకాలనీలో రోడ్డుపై వెళ్లాలంటే తంటా

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు లలితాకాలనీ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సెంటర్‌పాయింట్ జంక్షన్ నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం మీదుగా సింగ్‌హోటల్ జంక్షన్, జడ్జి కోర్టుకు సులువుగా చేరుకునేందుకు వాహనదారులు ఈ రహదారులను వినియోగిస్తుంటారు. రోడ్డంతా ఎక్కడికక్కడే గోతులతో నిండిపోయింది. వాహనదారులు కుదుపులతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండటం గమనార్హం. నిత్యం వేలాది సంఖ్యలో రాకపోకలు జరుగుతూ ఉండే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ ప్రాంతంలో తక్షణమే రహదారులు మెరుగుపరచాలని కోరుతున్నారు.



లలితాకాలనీలో గోతులమయంగా రోడ్డు

అంధకారంలో 80 అడుగుల రోడ్డు



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో వాహనాల వెలుగే దిక్కు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని 80 అడుగుల రోడ్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. కేంద్రీయ విద్యాలయం బ్యాక్ గేటు ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు పూర్తిగా దీపాలు వెలగకపోవడంతో చీకటిగా ఉంది. రాత్రి సమయంలో ఆ రోడ్డు గుండా నడిచేవారు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు పదిరోజుల నుంచి వీధి దీపాలు వెలగకపోయినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డులో వాహనదారులు రివ్వున దూసుకుపోతుంటారు. వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇంకా నగరంలో సీతమ్మధార, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు పాక్షికంగా వెలగకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీధుల్లో లైట్ల నిర్వహణ చేసే సిబ్బంది రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో పరిశీలనచేసి వెలగకపోవడానికి కారణాలు తెలుసుకుని మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం లోహశాస్త్ర ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (విశాఖపట్టణం) ఆధ్వర్యంలో పారిశ్రామిక వ్యవస్థాపనపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామప్రసాద్ మాట్లాడుతూ లోహ పదార్థ ఆధారిత పరిశ్రమలలో వ్యాపార అవకాశాలపై సూచనలు చేశారు. ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు, కొత్త విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పీఎం బాష, డా.ఎం.నారాయణ, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

జ్ఞానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా, సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మెడికవర్, పుష్పగిరి ఆసుపత్రుల సౌజన్యంతో ఉచిత ఆరోగ్య కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 250 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్య గుర్తించిన 35మందికి శస్త్ర చికిత్సలు చేస్తామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్లు డా.లావణ్య, ఎంఎస్ఎల్ రాజు, కె.మాణిక్యకుమారి, వలంటీర్లు కుమార్, అభి, రాజేష్ పాల్గొన్నారు.

'రన్ ఫర్ అంబేడ్కర్' రేపు

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 23న ఉదయం విశాఖ బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద నుంచి వైఎంసీఏ వరకు రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి సిద్ధార్థ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ లక్ష్యాలపై ప్రజలలో అవగాహన కల్పించే దిశగా ఈ రన్ చేపడుతున్నామని, అంబేడ్కర్‌వాదులు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు.

'ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడడం ద్వారా తిరిగి వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వార్డు అధ్యక్షుడు బాపు ఆనంద్ మాట్లాడుతూ బూత్, వార్డు, అనుబంధ కమిటీలను నియమించామని చెబుతూ ఆ నివేదికను అందజేశారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు నివేదిక అందజేస్తున్న వైసీపీ నాయకులు



అల్లిపురంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద శివునికి అభిషేకం చేస్తున్న భక్తులు



మురళీనగర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

అక్కయ్యపాలెం/మురళీనగర్/అల్లిపురం/సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసానికి ముగింపు పలుకుతూ శుక్రవారం పలు ప్రాంతాల్లో పోలిపాడ్యమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామునే నీటి వనరులున్నచోట దీపాలు వదిలి భక్తిని చాటుకున్నారు. కొందరు ఇళ్లవద్దనే పళ్లెంలో నీరు వేసి దీపాలు వెలిగించారు. అక్కయ్యపాలెం, కైలాసపురం, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లోని శివాలయాల్లో భోళాశంకరుడికి పూజలు చేశారు. మాధవధార, మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో వేకువ జామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు దైవ దర్శనాల్లో పాల్గొని అరటి దవ్వల్లో దీపాలు వెలిగించి నీటి కొలనుల్లో వదిలారు. మాధవధార కొండమీది భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. మురళీనగర్ హైస్కూలు సమీపంలోని శ్రీగౌరీ రామలింగేశ్వర ఆలయం ఆవరణలో దీపారాధనలకు కమిటీ సభ్యులు వసతులు కల్పించారు. అల్లిపురంలో కెప్టెన్ రామారావు జంక్షన్ రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొలను ఏర్పాటు చేయడంతో పెద్దసంఖ్యలో భక్తులు పోలి అమ్మను స్మరిస్తూ కొలనులో దీపాలు వదిలారు. భక్తులు పార్థివ లింగేశ్వరస్వామి మహారుద్రాభిషేకం, కోటి దీపాలంకరణసేవ, పీలా వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, పోలరావు, నారాయణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి ఆలయం, డీఎల్ఎస్ కాలనీ, వైర్లెస్‌కాలనీలోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో అర్చక బృందం దీపాలు వెలిగించి పూజలు చేయించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు విచ్చేసి పురోహితులకు స్వయంపాకం సమర్పించి, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కృత్రిమ కొలనులో భక్తులు దీపాలు వెలిగించి కార్తీకమాస ముగింపు పూజలు జరిపారు. అర్చకులకు స్వయంపాకం అందచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

రైల్వే జోన్‌కు ఇంకా రెడ్ సిగ్నలే...

... 5వ పేజీ తరువాయి

వినడానికి లేదు. ఆదేశాలు పాటించాల్సిన బాధ్యతా లేదు.

ఆగస్టు 15, దసరా అయిపోయాయి

దక్షిణ కోస్తా జోన్ గెజిట్ నోటిఫికేషన్ కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్ ఢిల్లీ వెళ్లి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మాట్లాడారు. గెజిట్ విడుదల చేస్తామన్నారు. ఆగస్టు 15న వస్తుందని భావించారు. రాలేదు. ఆ తరువాత విజయదశమికి ఇస్తారని అనుకున్నారు. అదీ దాటిపోయింది. నవంబరులో వచ్చే అవకాశం ఉందన్నారు. అదీ లేదు. ఇప్పుడు జనవరి 2026 అంటున్నారు.

ఎంత ఎంపీలను కలిసినా ...

దక్షిణ కోస్తా జోన్‌కు గెజిట్ విడుదల కోసం ఢిల్లీలో డిమాండ్ చేయాలని ఉత్తరాంధ్రాకు చెందిన ఎంపీలందరినీ కలిశాము. అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అరకు ఎంపీ తనూజరాణి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశాము. ఫలితం లేదు. తూర్పు కోస్తా రైల్వే అధికారులకు విశాఖను వదులుకోవడం ఇష్టం లేదు. అందుకే ఈ తాత్సారం. గెజిట్ రాకుండా జోన్ ఆపరేషన్ అసాధ్యం. దీనికి సీఎం చంద్రబాబునాయుడే చొరవ తీసుకోవాలి. ఈసారి ఢిల్లీ వెళ్లినప్పుడు దీనిపై గట్టిగా అడగాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

-చలసాని గాంధీ, రైల్వే యూనియన్ నాయకులు

డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు రాధిక సాహితీ పురస్కారం

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సాహితీవేత్త డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ (కాకినాడ) అత్యుత్తమ 15వ రాధిక సాహితీ పురస్కారాన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు రమణమూర్తి ఈ పురస్కారాన్ని అందచేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు అవార్డు ఇవ్వడం ఎంతో సమంజసమన్నారు. కస్తూరి ప్రసాద్ (రాధిక) రచనా ప్రతిభను కొనియాడారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సాహితీ ప్రతిభకు విద్యార్హత చాలదని, ఆసక్తి ఉండాలని, డాక్టర్ వృత్తిలో ఉన్నా మాటూరి శ్రీనివాస్ సాహితీ కృషి చేస్తున్నారని కొనియాడారు. పురస్కార ప్రదాత డాక్టర్ గెద్దాడ కస్తూరి ప్రసాద్ (రాధిక) పురస్కార వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ బండి సత్యనారాయణ, డేవిడ్ ప్రభాకర్, గొంతు నవీన్, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ సుజాత, పావని, ఉప్పల అప్పలరాజు, సూరపనేని విజయ్‌కుమార్, డాక్టర్ కె. వీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస్‌కు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

అంతర్గత రహదారులు అధ్వానం

... 5వ పేజీ తరువాయి

గోతులు తవ్వుతున్నారు. వాటిపై మట్టి పోసి వెళ్లిపోతున్నారు. వర్షాలకు అది కుంగిపోతోంది. ఆ మార్గాల్లో తారురోడ్లకు నిధులు మంజూరు చేస్తే ఆ గోతులను సరిచేయకుండా వాటిపైనే నిర్మాణం చేపడుతున్నారు. దీంతో అవి వారం రోజులకే కిందికి దిగిపోతున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తుంటే ఇంజనీరింగ్ అధికారులు కళ్లు మూసుకొని వాటికి బిల్లులు మంజూరు చేస్తున్నారు. బీచ్ రోడ్డులో సైతం పక్షపాతం చూపిస్తున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వైపు రోడ్డును చక్కగా నిర్వహిస్తూ ఫిషింగ్ హార్బర్ వైపు మార్గం గోతులు పడినా పూడ్చడం లేదు. వీటిపై జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ అసలు లేదు. పారిశుధ్యం కోసం వీధుల్లో తిరిగే అధికారులు చెత్తను చూస్తున్నారే తప్ప పాడైన రహదారులను పట్టించుకోవడం లేదు. రహదారులపై జీవీఎంసీ ఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అవన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది.

27న ఉక్కు కార్మికుల మహాధర్నా

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ఆధారిత జీతాల చెల్లింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఉక్కు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఈనెల 27న ప్లాంటు పరిపాలన భవనం ఎదుట మహాధర్నా చేపడతామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్ ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 27న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్లాంటు పరిపాలన భవనం ఎదుట మహాధర్నా చేపడతామని, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి ప్లాంట్‌లో పరిస్థితులు వివరించి ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

భూసర్వే, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు అభ్యంతరాల స్వీకరణ, తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీసర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి గ్రామ సభలు విధిగా నిర్వహించి ప్రక్రియను సజావుగా చేపట్టాలని స్పష్టంచేశారు. రైతుల సమక్షంలో ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. అశాంతికి, గందరగోళానికి తావులేకుండా రీసర్వే చేయాలని, ఒకవేళ వివాదాలు తలెత్తితే ఇరుపక్షాల సమక్షంలో పరిష్కార చర్యలు చేపట్టాలని, అనివార్యకారణాలతో ఒక వర్గం రాకపోతే మరో అవకాశం ఇవ్వాలని, అప్పటికీ రాకపోతే సుమోటోగా తీసుకుని నిబంధనలకు అనుగుణంగా అధికారులు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టంచేశారు. రీసర్వే అయిన భూములకు మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాల పరిష్కారానికి గడువు రెండేళ్లకు పెంచాలని కమిటీ అభిప్రాయపడిందని రఘురామకృష్ణరాజు అన్నారు. దీన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లి ఆచరణలో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ ప్రతిపాదించిన అంశాలలో దీన్ని ప్రధానంగా చేర్చాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రైతుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా స్థాయి అధికారి నుంచి వీఆర్వో వరకు ఏడాదికి ఒకసారి గ్రామాల్లో అందుబాటులో ఉండేలా జమాబందీ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని సూచించారు. భూఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ భూములు రీసర్వే చేసినప్పుడు కొన్నిచోట్ల జిరాయితీ భూములు 22-ఎలో పెట్టారని పేర్కొంటూ అటువంటి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. గంభీరంలో సర్వే నంబరు 228-4లో ఒక వ్యక్తి కొనుగోలు చేసిన జిరాయితీ భూమిని 22-ఎలో పెట్టారని పేర్కొంటూ ఇటువంటివి చాలా ఉన్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకర్మాగారం పరిధిలో ఆర్.కార్డులు పొందిన వారిలో 472 మంది ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికంగా ఉన్న విమల విద్యాలయం పరిస్థితిని ప్రస్తావించి సమస్య పరిష్కరించాలన్నారు. ఉక్కు కర్మాగారం పరిధిలో ఉన్న బస్ డిపో, గంగవరం మత్స్యకారులకు జెట్టీ నిర్మాణం, ఏపీఐఐసీ లేఅవుట్, అపెరల్ పార్కును 22-ఎ నుంచి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో శాసనసభా డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సర్వే విభాగం డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు సంగీత్‌మాథుర్, సుధాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

సభ్యులు తమ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా 'జీరో అవర్' కింద ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తానని, సభ్యులంతా సీట్లలో కూర్చోవాలని మేయర్ కోరారు. దీంతో వైసీపీ, సీపీఎం సభ్యులు ఆందోళన విరమించి తమ సీట్లలో కూర్చున్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు వెచ్చించి చేసే పనులకు కార్పొరేటర్లు ప్రతిపాదనలు ఇస్తారని, కానీ అజెండాలో 44 పనులను ఎమ్మెల్యే ప్రతిపాదించినట్టు పేర్కొనడం చూస్తుంటే కౌన్సిల్ ఏకంగా అసెంబ్లీగా మారిపోయిందనే భావన కలుగుతోందన్నారు. జీవీఎంసీ నిధులతో వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగితే వారి గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక మార్కెట్ ఆశీలు రూ.1.8 కోట్లకు పాడిన కాంట్రాక్టర్ తర్వాత టెండరు రద్దుచేసుకున్నారని, అయినా అదే కాంట్రాక్టర్‌తో అధికారులు ఆశీలు వసూలుచేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో రాష్ట్రప్రభుత్వానికి ఉన్న 10.5 శాతం వాటాను వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీకి అమ్మేశారని, అప్పుడు మాట్లాడని వైసీపీ సభ్యులు ఇప్పుడు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంటూ మొసలికన్నీరు కార్చుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు.

అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగా నగరంలో వీధిదీపాల కాంట్రాక్టు దక్కించుకున్న బీఎస్ఆర్ సంస్థ పనితీరుపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ 196 మంది టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ పది శాతం మందితోనే నెట్టుకురావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై ఏకరువుపెట్టారు. ముడసర్లోవ, గాజువాక సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణ చూస్తున్న 'రాశా' సంస్థ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేయాలని కమిషనర్ ఆదేశించినా ఇంతవరకూ అధికారులు పట్టించుకోకపోవడం, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్వహణ కాంట్రాక్టరే చూడాల్సి ఉన్నా, రిఫర్బిష్‌మెంట్ పేరుతో రూ.50 లక్షల చొప్పున జీవీఎంసీ నిధులు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించడం చూస్తుంటే కాంట్రాక్టర్‌తో మిలాఖత్ అయ్యారనే విషయం తేటతెల్లమవుతోందన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనవార్డులో ఉన్న సీసీఎస్ ప్రాజెక్టు సరిగా పనిచేయకపోయినా, కాంట్రాక్టర్ బిల్లులు పెడితే అధికారులు తిరస్కరించకపోవడం దారుణమన్నారు.

క్లాప్ వాహనాలను నిర్వహిస్తున్న దుర్గా కన్సల్టెన్సీ సరిగా పనిచేయడం లేదని తొమ్మిది నెలలు కిందటే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కౌన్సిల్ తీర్మానం చేస్తే ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ దుర్గా కన్సల్టెన్సీపై ఫిర్యాదులు రావడం వల్లనే క్లాప్ వాహనాల లోడర్ల జీతాలు చెల్లింపు బాధ్యతలను ఆ సంస్థ నుంచి తొలగించి మహిళాసంఘాలకు అప్పగించామన్నారు. సభ్యులు కోరితే జోన్‌ల వారీగా లోడర్ల నియామకాలకు టెండరు పిలుస్తామన్నారు. యాదవ సామాజిక భవనం కోసం చినగదిలి వద్ద 0.50 భూమి కేటాయింపు అంశంపై ఆ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ, బీజేపీ, టీడీపీకి చెందిన కొందరు అభ్యంతరం తెలిపారు. తమకు ఇప్పటికే ఎండాడ వద్ద స్థలం కేటాయించారని, ఇప్పుడు మరోసారి చినగదిలి వద్ద స్థలం కేటాయింపు ప్రతిపాదన పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో కేటాయింపులతో కౌన్సిల్‌కు సంబంధం లేదని, తాజా ప్రతిపాదన ప్రకారం స్థలం కేటాయింపునకు ఆమోదం తెలుపుతున్నట్టు మేయర్ ప్రకటించారు. స్మార్ట్ వెండింగ్ జోన్ కింద వీఎంఆర్‌డీఏ సెంట్రల్‌పార్కు చుట్టూ దుకాణాల ఏర్పాటుపై కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అభ్యంతరం తెలిపారు. ఆ స్థలాన్ని వీఎంఆర్‌డీ ఇప్పటికే కొన్ని సంస్థలకు లీజుకు ఇచ్చేసిందని చెప్పగా, కమిషనర్ జోక్యంచేసుకుని ఏదైనా సమస్య ఉంటే మరోచోట ఏర్పాటుచేస్తామని చెప్పారు. నగరంలోని 88 కిలోమీటర్లు ప్రధాన రహదారులను పీపీపీ కింద పదేళ్లపాటు ప్రైవేటు సంస్థ నిర్మించి, నిర్వహించుకునేలా ప్రతిపాదించిన అంశంపై సీపీఎం, వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని పట్టుబట్టారు. దీనికి కమిషనర్ వివరణ ఇస్తూ కేరళ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో ఈ విధానం ఉందని, కేవలం రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఉండేందుకే ఈ విధానం అమలు చేస్తున్నామని, కాంట్రాక్టర్‌కు ఒకేసారి బిల్లు ఇవ్వకుండా విడతల వారీగా పదేళ్లపాటు చెల్లిస్తామని, దీనివల్ల రోడ్డు దెబ్బతింటే బిల్లు నిలుపుదల చేస్తారనే భయంతో కాంట్రాక్టర్ నాణ్యతాలోపం లేకుండా రోడ్డునిర్మాణం చేస్తారని వివరించారు. ముడసర్లోవ వద్ద రైల్వే శాఖకు కేటాయించిన భూమిలో కొందరు ఆక్రమణదారులు ఉన్నందున వారిలో 47 మందికి జీవీఎంసీ ఆధీనంలో ఉన్న భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. జీవీఎంసీకి చెందిన భూమిలో ఎవరూ ఆక్రమణదారులు లేరని, తప్పుడు పేర్లు పెట్టి జీవీఎంసీ భూమిని కొట్టేసేందుకు ఎత్తుగడ వేస్తున్నారని అభ్యంతరం చెప్పారు. దీనిపై రూరల్ తహశీల్దార్ పాల్‌కిరణ్ వివరణ ఇస్తుండగానే ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు ప్రకటించి మేయర్ పోడియం దిగి వెళ్లిపోవడంతో కార్పొరేటర్లు, కమిషనర్‌తోపాటు అధికారులు సైతం అవాక్కయ్యారు.

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం



బీచ్ రోడ్డు : రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి

- గోతులమయంగా రహదారులు
- ఏళ్ల తరబడి చేపట్టని మరమ్మతులు
- యూజీడీ తవ్వకాలతో పలు చోట్ల ఛిద్రమైన రహదారులు

తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రహదారులు దారుణంగా తయారయ్యాయి. కొన్నేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడం, యూజీడీ పనుల పేరుతో ఎక్కడికక్కడే తవ్వకాలు చేపట్టి సరిగా పూడ్చకపోవడం, గోతులమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. వీటి గురించి ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రహదారులపై రాకపోకలు సాగించలేకపోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు గురవడం, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కనీస మౌలిక సదుపాయాల కల్పించ లేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉంటే ఎలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ వెళ్లే మార్గం నిండా గోతులతో నిండిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల రహదారిలో ప్రయాణించడ వల్ల వాహనాలు పాడవడమేకాకుండా శరీరం ఇబ్బందికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.

ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ వెళ్లే మార్గంలోని గోతుల దుస్థితి. వాహనచోదకులు ఆటోమోటివ్ సిగ్నల్, ఇసుకతోట సిగ్నల్‌లను తప్పించుకునేందుకు, ట్రాఫిక్‌ను అధిగమించి త్వరగా గమ్యస్థానాన్ని చేరుకునేందుకు ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయ బొమ్మ వద్ద జాతీయ రహదారి పైకి వాహనదారులు చేరుకోవచ్చు. దీనివల్ల వారికి ట్రాఫిక్, సమయం కూడా ఆదా అవుతుంది. కానీ ఈ మార్గంలో ఎక్కడ చూసినా గోతులే కనబడుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 16వ వార్డు కార్యాలయం వద్ద రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. చీకటి సమయంలో ఈ మార్గంలో విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా వెలగకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణా కళాశాల మెయిన్ గేటు వద్ద పైపులైన్ కోసం తవ్వారు, కానీ ఆ ఆ తర్వాత సరిగ్గా పూడ్చలేదు. అదే మార్గంలో ఎలియన్స్ కళాశాల వద్ద ఇటీవల వర్షానికి పడిన గోతుల్లో స్థానికులు తాత్కాలికంగా రాళ్లు వేసుకున్నారు. అదే విధంగా ఎస్‌బీఐ ఎదురుగా మ్యాన్‌హోల్ వద్ద ఏర్పడిన గొయ్యి వాహనచోదకుల నడుములను విరగగొడుతోంది. ఇదే వార్డులోని ఎంఎంటీసీ కాలనీ, ఎల్‌ఐసీ అపార్టుమెంటు వెనుక భాగంలో వినాయక ఆలయం వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి దాదాపు నాలుగు నెలలు గడిచింది. కానీ ఇంతవరకూ ఆ గోతులను సంపూర్ణంగా మూసివేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు సమస్యపై దృష్టి సారించి గోతులను పూడ్చివేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

బీచ్‌రోడ్డులో..

బీచ్ రోడ్డు : ఫిషింగ్ హార్బర్ వద్ద పలు రహదారులు దారుణంగా మారాయి. అధ్వానంగా మారిన రోడ్లపై నిత్యం అవస్థలు పడుతూ జనం ప్రయాణించాల్సి వస్తోంది. రోజులు, వారాలు కాదు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల పైప్‌లైన్, యూజీడీ పనులు నిమిత్తం రహదారులను తవ్వేశారు. ఆ పనులు పూర్తయినా గోతులను మాత్రం పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కాలం నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో కంకర రాళ్లు రోడ్డంతా తేలిపోయి మట్టి రోడ్డు కంటే దారుణంగా పరిస్థితి తయారైంది. రోడ్డుపై నడవడానికి కూడా వీలు లేకుండా రాళ్లు వ్యాపించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకోజీపాలెం : కృష్ణా కళాశాల వద్ద ఛిద్రమైన రోడ్డు



బీచ్‌రోడ్డు : ఫిషింగ్ హార్బర్ వద్ద రాళ్లు, మట్టి తేలిన రోడ్డు



వెంకోజీపాలెం : ఎస్‌బీఐ వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ఆరిలోవ : గతుకులమయంగా పెదగదిలి-విమ్స్ సర్వీసు రోడ్డు

ఆరిలోవలో..

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై ఎక్కడా చూసినా గోతులే కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతూ గాయాల పాలవుతున్నారు. పెదగదిలి జంక్షన్ నుంచి విమ్స్ వరకు ఉన్న సర్వీసు రోడ్డు పూర్తిగా పాడైంది. ఆరిలోవ హెల్త్ సిటీలో గల సర్వీసు రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. చినగదిలి సాయిబాబా గుడి నుంచి ఆరిలోవ వెళ్లే రోడ్డు, అలాగే శ్రీకాంత్‌నగర్ లే అవుట్ రోడ్డు పూర్తిగా పాడయ్యాయి. సుమారు ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి నెల కొని ఉందని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్డు గుంతల్లో నీరు చేరి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు.

అలాగే జీవీఎంసి 13వ వార్డు రామకృష్ణాపురంలో కూడా రహదారులు ఛిద్రమయ్యాయి. ఈ ప్రాంతంలో అనేక చోట్ల యూజీడీ పనులు చేపట్టి తవ్వకాలు చేశారు. ఆ పనులు పూర్తయినా సరిగా పూడ్చకపోవడంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటేనే గుబులు చెందుతున్నారు. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారిపోతోందని, నడిచే పరిస్థితి కూడా ఉండని పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనిఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వెంకోజీపాలెం : ఎంఎంటీసీ ఎల్‌ఐసీ అపార్టుమెంటు వెనుక మార్గంలో అసంపూర్తిగా పూడ్చిన మార్గం

దారపాలెంలో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా

- హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ ఆక్రమణ
- పక్కా నిర్మాణాలు చేపడుతున్న కబ్జారాయుళ్లు
- పట్టించుకోని 'రెవెన్యూ'
- మీటర్లు సైతం మంజూరు చేస్తున్న విద్యుత్ శాఖ

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల కొండ పోరంబోకు ప్రాంతంలో సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు రాజకీయ నేతల అండదండలతో ఈ తతంతం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలగా ఈ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా కబ్జా బాగోతం సాగుతోందని, అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం అర్థం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఆరు నెలల కిందట ఈ ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిలో సుమారు 19 హెచ్చరిక బోర్డులను రెవెన్యు సిబ్బంది ఏర్పాటు చేసింది. ఈ బోర్డులను తొలగించి మరీ కబ్జాదారులు రేకుల షెడ్డును నిర్మించడం గమనార్హం. స్థలాన్ని ఆక్రమించడమే కాదు షెడ్డులు, వివిధ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు కిక్కురుమనకపోవడం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ప్రాంతంలో గజం స్థలం సుమారు రూ.60 వేలు పలుకుతోంది. ఇక్కడ నిర్మించిన రేకుల షెడ్డుకు విద్యుత్ శాఖ అధికారులు మీటర్‌ను కూడా మంజూరు చేయడం గమనార్హం. సామాన్యులు ఇంటికి మీటరు కేటాయించమని దరఖాస్తు చేసుకుంటే, అంతా సక్రమంగా ఉన్నా సరే రోజుల తరబడి తిప్పించుకునే విద్యుత్ శాఖ అధికారులు, ఇలా ఆక్రమిత స్థలంలో చేపట్టిన నిర్మాణానికి మాత్రం వెనువెంటనే విద్యుత్ మీటర్ కేటాయించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



సర్వే నెంబరు 15/12లో ఆక్రమణకు గురైన 400 గజాల ప్రభుత్వ భూమిలో వెలసిన రేకుల షెడ్డు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు కార్యాలయంలో వద్ద పారిశుధ్య కార్మికులకు చీరలు, ఏకరూప దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో విశాఖ తూర్పు తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు ముగడ వాసు పాల్గొని పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్ల శ్రీను, పల్లా బాబు, ఎన్.కొండలరావు, సత్య, వార్డు శుభ్రం మేస్త్రీలు నమ్మి చిన్నరాజు, జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే వెలగపూడి పరామర్శ

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల బీసీ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొండేటి ఈశ్వరరావు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు శుక్రవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదం గురించి ఆరా తీశారు. బాధితుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో నష్ట పరిహారం గురించి అంచనా వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. వెంటనే నష్టపరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శితో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

వీధుల్లో చెత్త వేయవద్దు : కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి నగర సుందరీకరణను చెడగొట్టవద్దని 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి వార్డు ప్రజలకు హితవు పలికారు. శుక్రవారం ఆమె వార్డులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పలు చోట్ల గుట్టలుగా చెత్త పోస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆమె స్థానికులతో మాట్లాడుతూ చెత్తను జీవీఎంసీ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు అందించి సహకరించాలని సూచించారు. ఈ విధంగా చెత్తను వీధుల్లో వడేయడం వల్ల మన పరిసరాలను మనమే అధ్వానంగా చేసుకున్నవారమవుతామని పేర్కొన్నారు. ఈ విషయంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా మెలగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో చెత్త వేసే చోట దేవుడి చిత్రంతో కూడిన ఫ్లెక్సీలను ఉంచారు. ఈసారి ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధించడం జరుగుతుందనిహెచ్చరించారు.



చెత్త వేస్తున్న ప్రాంతంలో శుభ్రం చేయించి దేవుడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ మంగవేణి, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య(గోపాల పట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్యకిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 48, వంకాయలు (తెలుపు) 64, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 64, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 58, బీరకాయలు 60, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 28, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాత ది) 70, బరబాటి 60, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 36, కాప్సికమ్ 66, పొట్ల కాయ (పెద్దది) 26, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 80, గోరుచిక్కుడు 60, కూరపెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట)7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిదగుమ్మడి కాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ముగిసిన కార్తీక మాసోత్సవ పూజలు



రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో దీపాలను వదులుతున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో శివనామస్మరణతో నిర్వహించిన కార్తీక మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పోలి పాడ్యమి పురస్కరించుకొని మహిళలు తెల్లవారు జామునే మేల్కొని నెలంతా చేసిన 1001, 501, 108 ఒత్తులను ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కొలనులో అరటి దొప్పలపై ఉంచి వదిలారు. అనంతరం బ్రాహ్మణులకు వాయిణాలను ఇచ్చారు. అలాగే పాతవెంకోజీపాలెం శ్రీసీతా రామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనులో భక్తులు దీపాలను వదిలారు. అనంతరం ఆలయ అర్చకులకు వాయిణలను సమర్పించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి చెరువులు, ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనుల్లో దీపాలను విడిచిపెట్టారు. పెదగదిలిలో గల కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిన్న నీటి కొలనులో మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వేకువజామున అరటి డొప్పలపై (తెప్పలు) పసుపు కుంకుమ, అరటి పండ్లు, చలిమిడిని నివేదనగా సమర్పించి దీపాలను వెలగించారు. ఆ దీపాలను కొలనులో విడిచిపెట్టారు. అలాగే ఆరిలోవలోని బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర ఆలయంలో ఆలయం చీఫ్ ట్రస్టీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నీటి కొలనులో దీపాలను విడిచిపెట్టారు. అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయాన్ని అనుసరించి బ్రాహ్మణులకు వాయినాలు సమర్పించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ శ్రీవిద్య వినతిపత్రం

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులోని భీమిలి నియోజకవర్గానికి సంబంధించి కొండవాలు ప్రాంతంలో ప్రస్తుతం నిర్మిస్తున్న రక్షణ గోడల ఎత్తును 2 మీటర్లు పెంచాలని, మరిన్ని రక్షణ గోడలను నిర్మించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా కార్పొరేటర్ ఈ విషయమై ఆమె మాట్లాడారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. అదనంగా విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని, పారిశుధ్య సిబ్బందిని పెంచాలని, కాలువలు,రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



కమిషనర్‌ను వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

సత్యసాయి జయంతి వేడుకల్లో అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీలో గీతాలాపన చేస్తున్న వైష్ణవి, వాగ్దేవి

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయి బాబా నూరవ జన్మదినోత్సవాన్ని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంవీపీ కాలనీ ప్రేమసదన్‌లో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరిలో సినీ నేపథ్య వర్ధమాన గాయనీలైన అక్కచెల్లెళ్లు వైష్ణవి, వాగ్దేవీల కచేరి వీక్షకులను భక్తిపారవశ్యంలో ముంచింది. సాయంత్రం అయిదు గంటలకు వేద పఠనం, శ్రీసత్యసాయి అష్టోత్తర శతనామార్చన, యువజ విభాగం ఆధ్వర్యంలో నామ సంకీర్తన, పద్మశ్రీ డాక్టర్ యెల్లా వేంకటేశ్వరరావు శాస్త్రీయ సంగీత మృదంగం, భక్తి సంగీత కచేరీ, కేకు కటింగ్, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ లేబర్‌కోడ్స్‌పై సీఐటీయూ ఆందోళన

- గెజిట్ కాపీలను దహనం చేసి నిరసన



గెజిట్ కాపీలను దహనం చేస్తున్న సిటూ నాయకులు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ-లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికులకు ముప్పేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలుకు గెజిట్ జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జగదాంబజంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. కార్మికుల ద్రోహం చేసేలా చట్టాలను రూపొందించి అమలుచేస్తున్నాయన్నారు. ఈ-లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే యాజమాన్యాలకు సర్వాధికారాలు దక్కి, కార్మికులు బానిసలుగా మారుతారని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం ఈ-లేబర్‌కోడ్ గెజిట్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు.

మాస్టర్ ప్లాన్ పనులు వేగవంతం చేయాలి

- వీఎంఆర్డీ కమిషనర్ తేజ్ భరత్



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ తేజ్ భరత్

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ పనులను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసందానిస్తూ చేపట్టిన ఏడు రహదారుల నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ నేరెళ్లవలస- తాళ్లవలస, చిప్పాడ- పోలిపల్లి రహదారి పనులు గడువులోగా, నాణ్యత పాటించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. విమానాశ్రయం ప్రారంభించే సమయానికి ఎట్టి పరిస్థితుల్లో రహదారులు పూర్తి కావాల్సిందేనన్నారు. వీఎంఆర్డీఏ ప్రధానఇంజనీర్ వినయ్‌కుమార్, ముఖ్య ప్రణాళికాఅధికారి శిల్ప, ఇంజనీర్లు రామరాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం ఆరిలోవ 5వ సెక్టర్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదన్నారు. కార్తీక మాసంలో అన్నదానం చేయడం వల్ల మరింత ఫలితం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో స్థానికులు, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీ ఈఈ పొలాకి శ్రీనివాస్ తెలిపారు. నందగిరినగర్, చాకలిపేట, చెక్కుడురాయి బిల్డింగ్, రైల్వేన్యూ కాలనీ, హరగోపాల్ స్కూల్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాధవధార: మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి ఎన్‌ఏడి కొత్తరోడ్డు సమీపంలోని దుర్గాపురం, మాధవధార, అప్పయ్యనగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలు, కాకానినగర్‌తో పాటు ఎన్‌ఏడీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

జ్ఞానాపురం: కంచరపాలెం సెక్షన్‌లో జ్ఞానాపురం 33/11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శనివారం కాన్వెంటు కూడలి, జ్ఞానాపురం, పైడిమాంబ కాలనీ, ఎఫ్‌సీ గోదాం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని జోన్-2 ఈఈ టీకే నాయుడు కోరారు.

పసికందు మృతిపై ముమ్మర దర్యాప్తు

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం సంజీవయ్యకాలనీ మురుగుకాలువలో గురువారం పసికందును చంపి ముక్కలుగా పడేసిన ఘటనపై కంచరపాలెం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. మూడు బృందాలుగా ఏర్పడి ఘటన జరిగిన ప్రాంతంలో ఖాళీ స్థలాలు, పాడుబడిన భవనాలను శుక్రవారం తనిఖీ చేశారు. డ్రోన్ కెమెరాలతో పరిసరాలను పరిశీలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించి భిక్షాటన చేసే మహిళ చిత్రం గుర్తించినట్టు సమాచారం. పూర్తి ఆధారాలు లభ్యం కాకపోవడంతో సమగ్ర విచారణ చేస్తున్నట్టు తెలిపారు. అప్పుడే శిశువుకు జన్మనిచ్చిన మహిళ గర్భం నుంచి బయటకు వచ్చిన వ్యర్థాన్ని (మాయ) బట్టి చూస్తే...పుట్టిన వెంటనే శిశువును హత్య చేసి ముక్కలుగా కోసి పడేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో కేసును ఛేదించగలమని పోలీసులు భావిస్తున్నారు.

చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ మహిళలు



అధికార ప్రతినిధి అడుసుమిల్లి సురేష్‌తో భారత జట్టు చదరంగం క్రీడాకారిణులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫిడే ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ టోర్నీలో భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిందని భారత్ జట్టు అధికార ప్రతినిధి అడుసుమిల్లి సురేష్ తెలిపారు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నందిధా పి.వి., పద్మిని రౌత్, సవిత శ్రీ, శ్రీజ శేషాద్రి, వేల్పుల సరయు అద్భుతంగా రాణించి జట్టుకు క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చారని పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్‌లుగా వ్యవహరిస్తున్న స్వయంస్ మిశ్రా, సరితా రెడ్డి చక్కని సూచనలు చేస్తున్నారన్నారు. భారత మహిళల జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నీలో శిల్పజకు పతకం



విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా భారతి జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన కె.శిల్పజ రజత పతకం సొంతం చేసుకుంది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఆల్‌రౌండర్ ఈవెంట్‌లో శిల్పజ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. కోచ్ మనోవర్ వద్ద శిక్షణ పొందుతున్న శిల్పజ...స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ పోటీలకు నేరుగా ఎంపిక కావడం విశేషం. పతకం సాధించిన శిల్పజను శ్రీకృష్ణ విద్యామందిర్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

55వ వార్డు పరిధిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి పాత రామారావు ఆసుపత్రి సమీపంలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో సమస్యను స్థానికులు వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల క్రితం వాటిని అధికారులు పరిశీలించారు. శుక్రవారం రెండు నూతన విద్యుత్ స్తంభాలు వేశారు. దీంతో దీర్ఘకాలంగా స్థానికుల ఆందోళనకు కారణమైన సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ భరత్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుల దృష్టికి వార్డు టీడీపీ నాయకులు సమస్యను తీసుకెళ్లడంతో అధికారులు స్పందించారు. పనులను వార్డు కమిటీ ప్రతినిధులు రమణ అప్పారావు, మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, కోటి, వెంకటరావు, యమున, జయప్రకాశ్ తదితరులు పర్యవేక్షించారు.

అధ్వాన రహదారులతో వాహనదారులకు అవస్థలు

సీతమ్మధార, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు చేపట్టినా, సీతమ్మధార, సీతంపేట ప్రాంతాల్లో ఇంకా పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తూ రాకపోకలకు ప్రాణసంకటంగా మారాయి. సీతంపేట ప్రధాన రహదారిలోని శ్రీకృష్ణ విద్యామందిర్ సమీపంలోనూ, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద గోతులు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ద్విచక్రవాహనదారులు ఈ మార్గంలో వెళ్లినప్పుడు నడుముపై భారం పడి అవస్థలు పడుతున్నారు. అదే విధంగా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మలుపులో రోడ్డు అధ్వానంగా మారి పెద్ద గొయ్యి పడింది. దీంతో అటుగా వాహనాలు మలుపు తిరిగినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. సీతమ్మధార టీపీటీ కాలనీ, గురుద్వార నుంచి సీతమ్మధార వైపు, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో మంచినీటి పైపులైన్లు, యూజీడీ కోసం రహదారులు తవ్వడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



సీతంపేట ప్రధాన రహదారిలో రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా పెద్ద గొయ్యి



శ్రీకృష్ణ విద్యామందిర్ సమీపంలో ప్రమాదభరితంగా గొయ్యి

లలితాకాలనీలో రోడ్డుపై వెళ్లాలంటే తంటా

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు లలితాకాలనీ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సెంటర్‌పాయింట్ జంక్షన్ నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం మీదుగా సింగ్‌హోటల్ జంక్షన్, జడ్జి కోర్టుకు సులువుగా చేరుకునేందుకు వాహనదారులు ఈ రహదారులను వినియోగిస్తుంటారు. రోడ్డంతా ఎక్కడికక్కడే గోతులతో నిండిపోయింది. వాహనదారులు కుదుపులతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండటం గమనార్హం. నిత్యం వేలాది సంఖ్యలో రాకపోకలు జరుగుతూ ఉండే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ ప్రాంతంలో తక్షణమే రహదారులు మెరుగుపరచాలని కోరుతున్నారు.



లలితాకాలనీలో గోతులమయంగా రోడ్డు

అంధకారంలో 80 అడుగుల రోడ్డు



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో వాహనాల వెలుగే దిక్కు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని 80 అడుగుల రోడ్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. కేంద్రీయ విద్యాలయం బ్యాక్ గేటు ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు పూర్తిగా దీపాలు వెలగకపోవడంతో చీకటిగా ఉంది. రాత్రి సమయంలో ఆ రోడ్డు గుండా నడిచేవారు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు పదిరోజుల నుంచి వీధి దీపాలు వెలగకపోయినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డులో వాహనదారులు రివ్వున దూసుకుపోతుంటారు. వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇంకా నగరంలో సీతమ్మధార, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు పాక్షికంగా వెలగకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీధుల్లో లైట్ల నిర్వహణ చేసే సిబ్బంది రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో పరిశీలనచేసి వెలగకపోవడానికి కారణాలు తెలుసుకుని మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

కంచరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం లోహశాస్త్ర ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (విశాఖపట్టణం) ఆధ్వర్యంలో పారిశ్రామిక వ్యవస్థాపనపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామప్రసాద్ మాట్లాడుతూ లోహ పదార్థ ఆధారిత పరిశ్రమలలో వ్యాపార అవకాశాలపై సూచనలు చేశారు. ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు, కొత్త విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పీఎం బాష, డా.ఎం.నారాయణ, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

జ్ఞానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా, సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మెడికవర్, పుష్పగిరి ఆసుపత్రుల సౌజన్యంతో ఉచిత ఆరోగ్య కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 250 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్య గుర్తించిన 35మందికి శస్త్ర చికిత్సలు చేస్తామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్లు డా.లావణ్య, ఎంఎస్.ఎల్ రాజు, కె.మాణిక్యకుమారి, వలంటీర్లు కుమార్, అభి, రాజేష్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడాలి'



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు నివేదిక అందజేస్తున్న వైసీపీ నాయకులు

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడడం ద్వారా తిరిగి వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వార్డు అధ్యక్షుడు బాపు ఆనంద్ మాట్లాడుతూ బూత్, వార్డు, అనుబంధ కమిటీలను నియమించామని చెబుతూ ఆ నివేదికను అందజేశారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

'రన్ ఫర్ అంబేడ్కర్' రేపు

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 23న ఉదయం విశాఖ బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద నుంచి వైఎంసీఏ వరకు రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి సిద్ధార్థ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ లక్ష్యాలపై ప్రజలలో అవగాహన కల్పించే దిశగా ఈ రన్ చేపడుతున్నామని, అంబేడ్కర్‌వాదులు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు.



అల్లిపురంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద శివునికి అభిషేకం చేస్తున్న భక్తులు



మురళీనగర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

అక్కయ్యపాలెం/మురళీనగర్/అల్లిపురం/సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసానికి ముగింపు పలుకుతూ శుక్రవారం పలు ప్రాంతాల్లో పోలిపాడ్యమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామునే నీటి వనరులున్నచోట దీపాలు వదిలి భక్తిని చాటుకున్నారు. కొందరు ఇళ్లవద్దనే పళ్లెంలో నీరు వేసి దీపాలు వెలిగించారు. అక్కయ్యపాలెం, కైలాసపురం, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లోని శివాలయాల్లో భోళాశంకరుడికి పూజలు చేశారు. మాధవధార, మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో వేకువ జామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు దైవ దర్శనాల్లో పాల్గొని అరటి దవ్వల్లో దీపాలు వెలిగించి నీటి కొలనుల్లో వదిలారు. మాధవధార కొండమీది భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. మురళీనగర్ హైస్కూలు సమీపంలోని శ్రీగౌరీ రామలింగేశ్వర ఆలయం ఆవరణలో దీపారాధనలకు కమిటీ సభ్యులు వసతులు కల్పించారు. అల్లిపురంలో కెప్టెన్ రామారావు జంక్షన్ రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొలను ఏర్పాటు చేయడంతో పెద్దసంఖ్యలో భక్తులు పోలి అమ్మను స్మరిస్తూ కొలనులో దీపాలు వదిలారు. భక్తులు పార్థివ లింగేశ్వరస్వామి మహారుద్రాభిషేకం, కోటి దీపాలంకరణసేవ, పీలా వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, పోలరావు, నారాయణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి ఆలయం, డీఎల్ఎస్ కాలనీ, వైర్లెస్‌కాలనీలోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో అర్చక బృందం దీపాలు వెలిగించి పూజలు చేయించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు విచ్చేసి పురోహితులకు స్వయంపాకం సమర్పించి, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కృత్రిమ కొలనులో భక్తులు దీపాలు వెలిగించి కార్తీకమాస ముగింపు పూజలు జరిపారు. అర్చకులకు స్వయంపాకం అందచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

రైల్వే జోన్‌కు ఇంకా రెడ్ సిగ్నలే...

... 5వ పేజీ తరువాయి

వినడానికి లేదు. ఆదేశాలు పాటించాల్సిన బాధ్యతా లేదు.

ఆగస్టు 15, దసరా అయిపోయాయి

దక్షిణ కోస్తా జోన్ గెజిట్ నోటిఫికేషన్ కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్ ఢిల్లీ వెళ్లి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మాట్లాడారు. గెజిట్ విడుదల చేస్తామన్నారు. ఆగస్టు 15న వస్తుందని భావించారు. రాలేదు. ఆ తరువాత విజయదశమికి ఇస్తారని అనుకున్నారు. అదీ దాటిపోయింది. నవంబరులో వచ్చే అవకాశం ఉందన్నారు. అదీ లేదు. ఇప్పుడు జనవరి 2026 అంటున్నారు.

ఎంత ఎంపీలను కలిసినా ...

దక్షిణ కోస్తా జోన్‌కు గెజిట్ విడుదల కోసం ఢిల్లీలో డిమాండ్ చేయాలని ఉత్తరాంధ్రాకు చెందిన ఎంపీలందరినీ కలిశాము. అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అరకు ఎంపీ తనూజరాణి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశాము. ఫలితం లేదు. తూర్పు కోస్తా రైల్వే అధికారులకు విశాఖను వదులుకోవడం ఇష్టం లేదు. అందుకే ఈ తాత్సారం. గెజిట్ రాకుండా జోన్ ఆపరేషన్ అసాధ్యం. దీనికి సీఎం చంద్రబాబునాయుడే చొరవ తీసుకోవాలి. ఈసారి ఢిల్లీ వెళ్లినప్పుడు దీనిపై గట్టిగా అడగాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

-చలసాని గాంధీ, రైల్వే యూనియన్ నాయకులు

డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు రాధిక సాహితీ పురస్కారం



డాక్టర్ శ్రీనివాస్‌కు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సాహితీవేత్త డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ (కాకినాడ) అత్యుత్తమ 15వ రాధిక సాహితీ పురస్కారాన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు రమణమూర్తి ఈ పురస్కారాన్ని అందచేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు అవార్డు ఇవ్వడం ఎంతో సమంజసమన్నారు. కస్తూరి ప్రసాద్ (రాధిక) రచనా ప్రతిభను కొనియాడారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సాహితీ ప్రతిభకు విద్యార్హత చాలదని, ఆసక్తి ఉండాలని, డాక్టర్ వృత్తిలో ఉన్నా మాటూరి శ్రీనివాస్ సాహితీ కృషి చేస్తున్నారని కొనియాడారు. పురస్కార ప్రదాత డాక్టర్ గెద్దాడ కస్తూరి ప్రసాద్ (రాధిక) పురస్కార వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ బండి సత్యనారాయణ, డేవిడ్ ప్రభాకర్, గొంతు నవీన్, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ సుజాత, పావని, ఉప్పల అప్పలరాజు, సూరపనేని విజయ్‌కుమార్, డాక్టర్ కె. వీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు అధ్వానం

... 5వ పేజీ తరువాయి

గోతులు తవ్వుతున్నారు. వాటిపై మట్టి పోసి వెళ్లిపోతున్నారు. వర్షాలకు అది కుంగిపోతోంది. ఆ మార్గాల్లో తారురోడ్లకు నిధులు మంజూరు చేస్తే ఆ గోతులను సరిచేయకుండా వాటిపైనే నిర్మాణం చేపడుతున్నారు. దీంతో అవి వారం రోజులకే కిందికి దిగిపోతున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తుంటే ఇంజినీరింగ్ అధికారులు కళ్లు మూసుకొని వాటికి బిల్లులు మంజూరు చేస్తున్నారు. బీచ్ రోడ్డులో సైతం పక్షపాతం చూపిస్తున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వైపు రోడ్డును చక్కగా నిర్వహిస్తూ ఫిషింగ్ హార్బర్ వైపు మార్గం గోతులు పడినా పూడ్చడం లేదు. వీటిపై జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ అసలు లేదు. పారిశుధ్యం కోసం వీధుల్లో తిరిగే అధికారులు చెత్తను చూస్తున్నారే తప్ప పాడైన రహదారులను పట్టించుకోవడం లేదు. రహదారులపై జీవీఎంసీ ఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అవన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది.

27న ఉక్కు కార్మికుల మహాధర్నా

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ఆధారిత జీతాల చెల్లింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఉక్కు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఈనెల 27న ప్లాంటు పరిపాలన భవనం ఎదుట మహాధర్నా చేపడతామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్ ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 27న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్లాంటు పరిపాలన భవనం ఎదుట మహాధర్నా చేపడతామని, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి ప్లాంట్‌లో పరిస్థితులు వివరించి ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

భూసర్వే, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు అభ్యంతరాల స్వీకరణ, తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీసర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి గ్రామ సభలు విధిగా నిర్వహించి ప్రక్రియను సజావుగా చేపట్టాలని స్పష్టంచేశారు. రైతుల సమక్షంలో ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. అశాంతికి, గందరగోళానికి తావులేకుండా రీసర్వే చేయాలని, ఒకవేళ వివాదాలు తలెత్తితే ఇరుపక్షాల సమక్షంలో పరిష్కార చర్యలు చేపట్టాలని, అనివార్యకారణాలతో ఒక వర్గం రాకపోతే మరో అవకాశం ఇవ్వాలని, అప్పటికీ రాకపోతే సుమోటోగా తీసుకుని నిబంధనలకు అనుగుణంగా అధికారులు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టంచేశారు. రీసర్వే అయిన భూములకు మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాల పరిష్కారానికి గడువు రెండేళ్లకు పెంచాలని కమిటీ అభిప్రాయపడిందని రఘురామకృష్ణరాజు అన్నారు. దీన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లి ఆచరణలో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ ప్రతిపాదించిన అంశాలలో దీన్ని ప్రధానంగా చేర్చాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రైతుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా స్థాయి అధికారి నుంచి వీఆర్వో వరకు ఏడాదికి ఒకసారి గ్రామాల్లో అందుబాటులో ఉండేలా జమాబందీ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని సూచించారు. భూఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ భూములు రీసర్వే చేసినప్పుడు కొన్నిచోట్ల జిరాయితీ భూములు 22-ఎలో పెట్టారని పేర్కొంటూ అటువంటి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. గంభీరంలో సర్వే నంబరు 228-4లో ఒక వ్యక్తి కొనుగోలు చేసిన జిరాయితీ భూమిని 22-ఎలో పెట్టారని పేర్కొంటూ ఇటువంటివి చాలా ఉన్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకర్మాగారం పరిధిలో ఆర్.కార్డులు పొందిన వారిలో 472 మంది ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికంగా ఉన్న విమల విద్యాలయం పరిస్థితిని ప్రస్తావించి సమస్య పరిష్కరించాలన్నారు. ఉక్కు కర్మాగారం పరిధిలో ఉన్న బస్ డిపో, గంగవరం మత్స్యకారులకు జెట్టీ నిర్మాణం, ఏపీఐఐసీ లేఅవుట్, అపెరల్ పార్కును 22-ఎ నుంచి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో శాసనసభా డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సర్వే విభాగం డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు సంగీత్‌మాథుర్, సుధాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

సభ్యులు తమ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా 'జీరో అవర్' కింద ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తానని, సభ్యులంతా సీట్లలో కూర్చోవాలని మేయర్ కోరారు. దీంతో వైసీపీ, సీపీఎం సభ్యులు ఆందోళన విరమించి తమ సీట్లలో కూర్చున్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు వెచ్చించి చేసే పనులకు కార్పొరేటర్లు ప్రతిపాదనలు ఇస్తారని, కానీ అజెండాలో 44 పనులను ఎమ్మెల్యే ప్రతిపాదించినట్టు పేర్కొనడం చూస్తుంటే కౌన్సిల్ ఏకంగా అసెంబ్లీగా మారిపోయిందనే భావన కలుగుతోందన్నారు. జీవీఎంసీ నిధులతో వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగితే వారి గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక మార్కెట్ ఆశీలు రూ.1.8 కోట్లకు పాడిన కాంట్రాక్టర్ తర్వాత టెండరు రద్దుచేసుకున్నారని, అయినా అదే కాంట్రాక్టర్‌తో అధికారులు ఆశీలు వసూలుచేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో రాష్ట్రప్రభుత్వానికి ఉన్న 10.5 శాతం వాటాను వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీకి అమ్మేశారని, అప్పుడు మాట్లాడని వైసీపీ సభ్యులు ఇప్పుడు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంటూ మొసలికన్నీరు కార్చుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు.

అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగా నగరంలో వీధిదీపాల కాంట్రాక్టు దక్కించుకున్న బీఎస్ ఆర్ సంస్థ పనితీరుపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ 196 మంది టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ పది శాతం మందితోనే నెట్టుకురావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై ఏకరువుపెట్టారు. ముడసర్లోవ, గాజువాక సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణ చూస్తున్న 'రాశా' సంస్థ నుంచి రూ.56 లక్షలు రికవరీ చేయాలని కమిషనర్ ఆదేశించినా ఇంతవరకూ అధికారులు పట్టించుకోకపోవడం, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్వహణ కాంట్రాక్టరే చూడాల్సి ఉన్నా, రిఫర్బిష్‌మెంట్ పేరుతో రూ.50 లక్షల చొప్పున జీవీఎంసీ నిధులు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించడం చూస్తుంటే కాంట్రాక్టర్‌తో మిలాఖత్ అయ్యారనే విషయం తేటతెల్లమవుతోందన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనవార్డులో ఉన్న సీసీఎస్ ప్రాజెక్టు సరిగా పనిచేయకపోయినా, కాంట్రాక్టర్ బిల్లులు పెడితే అధికారులు తిరస్కరించకపోవడం దారుణమన్నారు.

క్లాప్ వాహనాలను నిర్వహిస్తున్న దుర్గా కన్సల్టెన్సీ సరిగా పనిచేయడం లేదని తొమ్మిది నెలలు కిందటే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కౌన్సిల్ తీర్మానం చేస్తే ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ దుర్గా కన్సల్టెన్సీపై ఫిర్యాదులు రావడం వల్లనే క్లాప్ వాహనాల లోడర్ల జీతాలు చెల్లింపు బాధ్యతలను ఆ సంస్థ నుంచి తొలగించి మహిళాసంఘాలకు అప్పగించామన్నారు. సభ్యులు కోరితే జోన్‌ల వారీగా లోడర్ల నియామకాలకు టెండరు పిలుస్తామన్నారు. యాదవ సామాజిక భవనం కోసం చినగదిలి వద్ద 0.50 భూమి కేటాయింపు అంశంపై ఆ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ, బీజేపీ, టీడీపీకి చెందిన కొందరు అభ్యంతరం తెలిపారు. తమకు ఇప్పటికే ఎండాడ వద్ద స్థలం కేటాయించారని, ఇప్పుడు మరోసారి చినగదిలి వద్ద స్థలం కేటాయింపు ప్రతిపాదన పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో కేటాయింపులతో కౌన్సిల్‌కు సంబంధం లేదని, తాజా ప్రతిపాదన ప్రకారం స్థలం కేటాయింపునకు ఆమోదం తెలుపుతున్నట్టు మేయర్ ప్రకటించారు. స్మార్ట్ వెండింగ్ జోన్ కింద వీఎంఆర్‌డీఏ సెంట్రల్‌పార్కు చుట్టూ దుకాణాల ఏర్పాటుపై కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అభ్యంతరం తెలిపారు. ఆ స్థలాన్ని వీఎంఆర్‌డీ ఇప్పటికే కొన్ని సంస్థలకు లీజుకు ఇచ్చేసిందని చెప్పగా, కమిషనర్ జోక్యంచేసుకుని ఏదైనా సమస్య ఉంటే మరోచోట ఏర్పాటుచేస్తామని చెప్పారు. నగరంలోని 88 కిలోమీటర్ల ప్రధాన రహదారులను పీపీపీ కింద పదేళ్లపాటు ప్రైవేటు సంస్థ నిర్మించి, నిర్వహించుకునేలా ప్రతిపాదించిన అంశంపై సీపీఎం, వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని పట్టుబట్టారు. దీనికి కమిషనర్ వివరణ ఇస్తూ కేరళ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో ఈ విధానం ఉందని, కేవలం రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఉండేందుకే ఈ విధానం అమలు చేస్తున్నామని, కాంట్రాక్టర్‌కు ఒకేసారి బిల్లు ఇవ్వకుండా విడతల వారీగా పదేళ్లపాటు చెల్లిస్తామని, దీనివల్ల రోడ్డు దెబ్బతింటే బిల్లు నిలుపుదల చేస్తారనే భయంతో కాంట్రాక్టర్ నాణ్యతాలోపం లేకుండా రోడ్డునిర్మాణం చేస్తారని వివరించారు. ముడసర్లోవ వద్ద రైల్వే శాఖకు కేటాయించిన భూమిలో కొందరు ఆక్రమణదారులు ఉన్నందున వారిలో 47 మందికి జీవీఎంసీ ఆధీనంలో ఉన్న భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. జీవీఎంసీకి చెందిన భూమిలో ఎవరూ ఆక్రమణదారులు లేరని, తప్పుడు పేర్లు పెట్టి జీవీఎంసీ భూమిని కొట్టేసేందుకు ఎత్తుగడ వేస్తున్నారని అభ్యంతరం చెప్పారు. దీనిపై రూరల్ తహశీల్దార్ పాల్‌కిరణ్ వివరణ ఇస్తుండగానే ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు ప్రకటించి మేయర్ పోడియం దిగి వెళ్లిపోవడంతో కార్పొరేటర్లు, కమిషనర్‌తోపాటు అధికారులు సైతం అవాక్కయ్యారు.

దుర్గమాంబకు పూజలు

అగనంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం


గౌరీపరమేశ్వరులు

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సమీపంలో ప్రకాశ్ నగర్‌లో శనివారం గౌరీపరమేశ్వరుల అను పోత్సం నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. 50 ఏళ్లగా ఈ ఉత్సవాన్ని ప్రకాశ్ నగర్ గవర కులస్థులు ప్రత్యేకంగా చేపడు తున్నారు. కార్తీక మాసం ఆరంభానికి ముం దు గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ప్రారంభిం చి, అమ్మవారి వరిదుబ్బును ఆలయానికి తీసుకువచ్చి 45 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం చివరి రోజున అనుపోత్సం చేస్తుంటారు. ఈ నేప థ్యంలో శనివారం గౌరీపరమేశ్వరుల అను పోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా సత్యసాయి శత జయంతి

వేపగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురం సత్యసాయి ప్రార్థనామందిరంలో సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిసున్నారు. దీనిలో భాగంగా సత్యసాయి వ్రతాలు, లలితా సహస్రనామపారాయణం, స్త్రీలకు వస్త్రాత పంపిణీ, యువజన సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

ఘనంగా అన్నసమారాధన

గోపాలపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమిని పురస్కరించుకుని స్థానిక నందమూరినగర్‌లో కొలువైన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని బెహరా భాస్కర రావు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గన్నారు.

విశ్వేశ్వర ఆలయంలో..

పెందుర్తి: సుజాతనగర్ రత్నగిరి కాలనీలో ఉన్న విశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగ్గా ఈశ్వరరావు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎనిమిది వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత విశ్వేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ).
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక).
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 48, వంకాయలు (తెలుపు) 64, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 64, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 58, బీరకాయలు 60, ఆనపకాయ 34,కాలీఫ్లవర్ 44, క్యాబేజి 28, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)7,మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 60, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 38, వెల్లి(పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 36, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 34, చిలగడదుంపలు 38, కంద 50, దేముడుచిక్కుడు 80, గోరుచిక్కుడు60, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొం డఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీ ర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూ డిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226


వేపగుంట: ఎన్ఏడీ నుంచి గాజువాక వెళ్లే రహదారిలో గుంతలు


ఆటోనగర్ నుంచి తోకాడ వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి


షీలానగర్ ప్రధాన రహదారిలో గుంతలు

అసలే ఇరుకు రోడ్లు.. పైగా గోతులు

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు

గాజువాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన రోడ్లన్ని గుంతలమయమయ్యాయి. ఈ ప్రాంతంలో ఏ రోడ్డును చూసినా గోతులతో నిండిపోయి ఉన్నాయి. ఏ మాత్రం ఆదమరిచి వాహనం నడిపినా ప్రమాదాలకు గురికాక తప్పదు. గాజువాకలో ప్రధానంగ జగ్గు జంక్షన్, వై జంక్షన్, గంగవరం పోర్టు రోడ్డు, గాజువాక కణితి స్టీల్‌ప్లాంట్ రహదారి ఇలా అన్ని రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో వాహనదారుల ఇబ్బందులు రెట్టింపుఅవుతున్నాయి. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. గాజువాకలో ప్రధాన మార్గాల్లో భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుండడం వల్ల రోడ్లపై ఏర్పడిన గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎన్ఏడీ ఫ్లైఓవర్ దగ్గర..

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద గాజువాకకు వెళ్లే సర్వీస్ రోడ్డులో గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శివాలయానికి ముందున్న ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడింది. రైల్వేఫ్లైఓవర్ చేరుకునే మార్గంలో మరో నాలుగు గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో కాకానీనగర్ నుంచి ఎన్ఏడీ ఫ్లైఓవర్ కిందకు సర్వీస్ రోడ్డుకు దిగే వాహనాలు తప్పించే క్రమంలో వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవతున్నారు. దీనిపై అనేకమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంకోలేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


గాజువాక : రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే రోడ్డు

రాకపోకలు నరకం

ఆటోనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బలు తిని గుంతల మయంగా మారాయి. దీంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 71వవార్డు ఆటోనగర్ నుంచి పకీరుతఖ్యాకు, తోకాడకు వెళ్లే రహదారులు పూర్తిగా గుంతలు పడ్డాయి. పలు కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులకు ఇదే ప్రధాన రహదారి. ఈ గుంతల వల్ల అయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రహదారులకు కనీసం మరమ్మతులు చేయించలేదని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని, నూతన రహదారులను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

షీలానగర్ ప్రధాన రహదారిలో..

అక్కిరెడ్డిపాలెం: మొంథా తుపాన్ ప్రభావం కారణంగా 68, 69 వార్డుల్లో పలు కాలనీల ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. జాతీయ రహదారి నుంచి షీలానగర్ మీదుగా సబ్బవరానికి వెళ్లే ప్రధాన రహదారిలో హరిజన జగ్గయ్యపాలెం వద్ద, వెంకటేశ్వరకాలనీ బజారు వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వీటి వల్ల ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్ నుంచి తుంగ్లాంకు వెళ్లే రహదారితో పాటు చుక్కవానిపాలెం నుంచి షీలానగర్‌కు వెళ్లే రహదారిలో కూడా పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ: పెదగంట్యాడ బీటీ రోడ్డు నుంచి యాతపాలెం, వెంకన్నపాలెం వెళ్లే ఇండస్ట్రీయల్ ఎస్టేట్ రోడ్డు అధ్వానంగా మారింది. ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన ఈ తారు రోడ్డుకు సకాలంలో మరమ్మతులను చేపట్టక పోవడంతో ఈ స్థితిలో ఉన్నది. సుమారు కిలోమీటరు పొడవున్న ఈ రోడ్డు మొత్తం మట్టి రోడ్డులా తయారైంది. పారిశ్రామిక వాడకు చెందిన భారీ వాహనాలు, వెంకన్నపాలెం, యాతపాలెం కాలనీల వాహనదారులు ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ముందు చిన్నచిన్న గోతులు పడినప్పుడు దీనిని ఎవరూ పట్టించుకో లేదు. తరువాత కురిసిన వర్షాలకు రోడ్డు మీద నీరు చేరి బురద మయంగా మారడం, ఈ రోడ్డు నుంచే భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు మొత్తం మట్టి రోడ్డులా తయారయ్యింది. ఈ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, రాళ్ళ తేలాయి. ఈ రోడ్డు నుంచి రాక పోకలు సాగించాలంటే ద్విచక్ర వాహనదారలు భయపడుతున్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుపై దృష్టిసారించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

- దీపకాంతులతో వెలిగిపోయిన ఆలయాలు, చెరువులు
- గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో పోటెత్తిన భక్తులు

కూర్మన్నపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70, 71, 86, 87 వార్డుల్లో పోలిపాడ్యమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల పుష్కరిణుల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పలు వైష్ణవ, శివాలయాలకు భక్తులు పోటెత్తారు. 70వ వార్డు ఆటోనగర్ శివాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే చట్టివానిపాలెం బాలా త్రిపురసుందరి అమృత లింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. 71వ వార్డు శ్రీనగర్ కృష్ణాలయంలో భక్తులు దీపారాధన చేశారు. 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో ఉన్న విశ్వేశ్వర దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. 87వ వార్డు వడ్లపూడి సీతారామలింగేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక పూజలు, దీపారాధనలు నిర్వహించారు. కణితి పద్మశాలీ వీధిలో ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభి షేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అక్కిరెడ్డిపాలెం: దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కిటకిటలాడిన శివాలయాలు

మల్కాపురం: కార్తీకమాసం చివరిరోజు కారణంగా శివాలయాలు భక్తులతో కిటకిటలా డాయి. ఈ సందర్భంగా శుక్రవారం వేకువ జా ము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నీటి కొలనల్లో దీపాలను విడిచి పూజలు చేశారు.

కొత్తపాలెం గ్రామంలో..

గోపాలపట్నం: పోలిపాడ్యమిని పురస్కరించుకుని స్థానిక కొత్తపాలెం గ్రామంలో గౌరీకేధారేశ్వర స్వామి ఆలయంలో శుక్రారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయం ప్రాంగణంలో కోనేటిలో దీపారాధన చేశారు. అలాగే స్థానిక ఎంఈఎస్ పంపు హౌస్ వద్ద మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలువ, కోటనరవ చెరువు వద్ద దీపారాధన ఘనంగా నిర్వహించారు.

కాంతులీనిన చెరువులు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం చెరువు, నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువు, అక్కిరెడ్డిపాలెంలో మల్లమ్మ పేరంటాల చెరువు కార్తీక దీపాలతో కాంతులీనాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో చెరువల వద్ద సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. తుంగ్లాం చెరువులో 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు పూజలు చేశారు.


వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ తేజ్ భరత్

మాస్టర్ ప్లాన్‌పనులు వేగవంతం చేయాలి

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ పనులను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానిస్తూ చేపట్టిన ఏడు రహదారుల నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ నేరెళ్లవలస- తాళ్లవలస, చిప్పాడ- పోలిపల్లి రహదారి పనులు గడువులోగా, నాణ్యత పాటించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. విమానాశ్రయం ప్రారంభించే సమయానికి ఎట్టి పరిస్థితుల్లో రహదారులు పూర్తి కావాల్సిందేనన్నారు. వీఎంఆర్డీఏ ప్రధానఇంజనీర్ వినయ్‌కుమార్, ముఖ్య ప్రణాళికాఅధికారి శిల్ప, ఇంజనీర్లు రామరాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

ఈ లేబర్‌కోడ్స్‌పై సీఐటీయూ ఆందోళన


గెజిట్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఈ-లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికులకు ముప్పేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలుకు గెజిట్ జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జగదాంబజంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. కార్మికుల ద్రోహం చేసేలా చట్టాలను రూపొందించి అమలుచేస్తున్నాయన్నారు. ఈ-లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే యాజమాన్యాలకు సర్వాధికారాలు దక్కి,కార్మికులు బానిసలుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గెజిట్ కాపీలను దహనం చేశారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ మాక్‌డ్రిల్

కూర్మన్నపాలెం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వేస్టేషన్‌లో 'సాగర్ కవచ్' పేరుతో ఆర్పీఎఫ్ మాక్ డ్రిల్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీవ్రవాదులు, అసాంఘీక కార్యకలాపాలు సాగించే దుండగులను గుర్తించడం, వారి ఆగడాలను అరికట్టడం వంటి సంఘటనలు ప్రదర్శించారు. ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ కుమార్ బెహ్రా, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సారథ్యంలో సుమారు 50 మంది సిబ్బందితో ప్రయాణికులలో కలిసిపోయి కారు పార్కింగ్ ప్రాంతంలో బాంబ్‌లు పెట్టేందుకు సిద్ధమైనట్టు, తీవ్రవాదుల హావభావాలను ప్రదిర్శంచారు. ఈ సందర్భంగా వేరే విభాగానికి చెందిన ఇద్దరు అధికారుల చేత తీవ్రవాదుల హావభావాలను ప్రదర్శింపజేసి, వారిని అరెస్టు చేసినట్టు పోలీసులు వ్యవహరించారు. ఇదంతా చూసిన ప్రయాణికులు ముందు కొంచెం కంగారు పడ్డారు. కాసేపటికి అది మాక్‌డ్రిల్ అని తెలియడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. తోటి ప్రయాణికులను కనిపెడుతూ ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


డ్రిల్‌లో భాగంగా బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ 33/11 కేవీ ఫీడర్‌ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. షీలానగర్, గవర జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియా, ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

మల్కాపురం: మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. సింధియా జంక్షన్, బీపీసీఎల్ గొడౌన్, వై-జంక్షన్, డాక్‌యార్డు ఏరియా, నవయుగ, ఈబీపీఎల్, ఆయిల్ ఓర్పా, శాతవాహన్ బస్‌స్టాప్, కాకతీయ గేటు, ఐఎన్‌హెచ్ కల్యాణి ఆస్పత్రి, చింతమణి ఆలయ ఏరియా ప్రజలు సహకరించాలని కోరారు.

గోపాలపట్నం: స్థానిక కొత్తపాలెం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సంతోశ్‌నగర్, గణేశ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, ఎస్సీకాలనీ ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆటోనగర్: విద్యుత్ పనుల నిర్వహణ కారణంగా 11 కేవీ ఎల్‌బీఎస్ నగర్, శ్రామిక నగర్, చిన గంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీకే.నాయుడు తెలిపారు. డ్రైవర్స్ కాలనీ, శ్రామిక నగర్, దత్త సాయి నగర్, ఎర్రగడ్డ కాలనీ, తదితర కాలనీ ప్రజలు సహకరించాలన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటా

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


కార్యకర్తతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అన్ని విధాలా తోడుంటానని, వారే పార్టీకి వెన్నెముక అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కార్యకర్తల మనోభావాలు, స్థితిగతులను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న 'నా కార్యకర్త' కార్యక్రమంలో భాగంగా పార్టీ విశాఖ జిల్లా సెక్రటరీ కళ్లేపల్లి శ్రీనివాసవర్మతో శుక్రవారం మాట్లాడారు. ఇప్పటి వరకు సుమారు నాలుగు వందల మందితో మాట్లాడానని, కార్యకర్తలతో వ్యక్తి గతంగా మాట్లాడుతున్నానని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


జాబ్‌మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మెగా జాబ్ మేళాను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకే కార్పొరేట్ కంపెనీల సిబ్బంది ఇక్కడికి చేరుకుని స్టాల్స్‌ను ఏ ర్పాటు చేసి ఇంటర్వ్యూలను నిర్వహించారు. అనేక మంది నిరుద్యోగులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని తరువాత ఇంటర్వ్యూలకు వెళ్లారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

సీఎం చంద్రబాబు విజనరీ ఉన్న నాయకుడని, ఈ నేపథ్యంలోనే మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళాలను ఏర్పాటు నిర్వహించాలన్నారని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో గోపాలపట్నం, కంచరపాలెంలో జాబ్‌మేళాలు నిర్వహించామని తెలిపారు. త్వరలోనే శ్రీహరిపురం ప్రాంతంలో మరో జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా పోలిపల్లి(చిన్న), బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలను డీఈవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు, ఉత్తీర్ణత సాధించాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల నోట్ పుస్తకాలను, ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో వారికి వచ్చిన మార్కులను పరిశీలించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు వడ్డించారు.

వేపగుంట హైస్కూల్‌లో..

వేపగుంట: వేపగుంట హైస్కూల్‌లో నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను డీఈవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధాయులు చేస్తున్న ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాజెక్టులు నిత్య జీవితంలో ఉపయోగపడేలా ఉండాలని, ముఖ్యంగా ప్రస్తుతం పాఠశాల్లో ఆయా పద్ధతులు అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కంప్యూటర్ల శిక్షణ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. శిక్షణలో పాల్గన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్‌ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ మెంటార్ రాజశక్రఖర్, జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి'

అగనంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని గొన్నా విద్యాసంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు సూచించారు. 85వ వార్డు గొన్నవానిపాలెంలో ఉన్న గొన్నా విద్యా సంస్థల్లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ పీవీ.సురేశ్, టీడీపీ మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు లు శుక్రవారం వేరువేరుగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ పరిశుధ్య కార్మికులను ఎంతగానో గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

90వ వార్డులో..

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డులో పారిశుధ్య కార్మికులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు వై.తిరుమల రావు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులతో ఈ దుస్తులు పంపిణీ చేస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో కార్మికు సంక్షేమం గురించి సరిగా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపించండి

- ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాసిత నిరుద్యోగులు శుక్రవారం ప్లాంట్ నెహ్రూ పార్కులో సమావేశమయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించేదని వాపోయారు. ఇటీవల కాలంలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించిందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు కల్పించుకుని తమకు న్యాయం చేయాలన్నారు. నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటాలి'

కూర్మన్నపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23, 24 తేదీల్లో పులివెందులలో జరిగే 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలురు, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలకు వెళ తున్న కణితి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులను, సింగరాయ కొండలో జరగనున్న అండర్-19 బాలురు, బాలికల రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన వారిని ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ క్రీడల్లో విజేతలుగా నిలిచి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు.

ఉచిత స్కూటీలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శారీరక, విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల మోటార్ సైకిళ్ల (స్కూటీలు) పంపిణీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత తెలిపారు. నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ చేస్తామని, అభ్యర్థుల వయసు ఈ నెల 21 నాటికి 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని, సదరం ధ్రువపత్రం కాళ్లలో (లోయర్ లింబ్స్) వైకల్యం 70 శాతం, అంతకంటే ఎక్కువ ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని,డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, సొంత వాహనం ఉంటే అనర్హులన్నారు.

నేటి నుంచి స్విమ్మింగ్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారంప్రారంభం కానుంది. బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులోని పూల్‌లో జరగనున్న టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది స్విమ్మర్లు పాల్గొంటారని రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకట్‌రామ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

జన సంద్రమైన సింహాచలం వరాహ పుష్కరిణి







సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలిపాడ్యమిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీకమాసం ముగియడంతో చెరువులు, కుంటలు, నదులు, నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనుల్లో దీపాలను విడిచిపెట్టి కార్తీక దామోదరుడికి పూజలు చేశారు. కాగా సింహాచలంలోని వరాహ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, దీపాలు వదిలేందుకు భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. దీంతో పుష్కరిణి ప్రాంతం కిక్కిరిసింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచే మహిళలు భారీగా తరలివచ్చారు. పుణ్యస్నానాలను ఆచరించి, సంప్రదాయం మేరకు అరటి డొప్పలలో ఉసిరికాయలు ఉంచి, దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం వాటిని పుష్కరిణిలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహన రాకపోకలకు క్రమబద్ధీకరించారు. భక్తులు స్నానాలు చేసే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా పుష్కరిణి వద్ద దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.



సింహాచలంలోని వరాహ పుష్కరిణిలో దీపాలు వదులుతున్న భక్తులు



భీమిలి ఉప్పుటేరు వద్ద భక్తజనం



మల్కాపురం ప్రకాశనగర్‌లో ఏర్పాటుచేసిన కొలనులో దీపాలు వదులుతున్న భక్తులు



వరాహ పుష్కరిణి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొట్లాటలో ఒకరికి గాయాలు

- యువతితో ఇద్దరు యువకుల ప్రేమాయణం
- వారి మధ్య రాజీకి ప్రేయసి యత్నం
- కుదరకపోవడంతో దాడి: ఒకరికి గాయాలు

మద్దిలపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకే యువతిని ఇద్దరు యువకులు ప్రేమించారు. ఆమె ఇద్దరి ప్రేమను అంగీకరించడంతో ఐదేళ్లుగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడిచింది. అయితే యువకుల మధ్య ఇటీవల గొడవలు మొదలయ్యాయి. ఆమె ఒకరితో మాట్లాడితే మరొకరికి కోపం వచ్చేది. దీంతో ఆమె వారిని మ్యానేజ్ చేయలేక రాజీ చేయడానికి ప్రయత్నించింది. కుదరకపోవడంతో యువకులు కత్తితో దాడి చేసుకున్నారు. సిరిపురం ప్రభుత్వ వసతిగృహం ఏరియాలో శుక్రవారం జరిగిన సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి.భోగాపురానికి చెందిన సిరిగుడి చైతన్య(22) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఆమె సిరిపురంలోని ఓ హోటల్లో పనిచేస్తోంది. ఇక్కడే నివసిస్తున్న సూర్య కార్తికేయన్‌కు కూడా యువతితో పరిచయమై, ప్రేమించుకున్నారు. ఈ వ్యవహారం ఐదేళ్లుగా సాగుతోంది. ఇటీవల వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో ఇద్దరి మధ్య రాజీ కుదర్చాలని యువతి భావించింది. ఈ క్రమంలో వారిని సిరిపురం బస్టాప్ వద్దకు పిలిచింది. వారి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేయగా తిట్టుకుంటూ దాడిచేసుకున్నారు. దీంతో చైతన్య తన వెంట తెచ్చుకున్న చాకుతో కార్తికేయ మీద దాడికి యత్నించాడు. ఇద్దరు చాకుతో సిగపట్లు పట్టడంతో చైతన్యకు గాయమైంది. దీంతో యువతి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేములవలసలో దొంగల బీభత్సం

- రెండు షాపుల షట్టర్లు పగలగొట్టి చోరీ

ఆనందపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు దుకాణాల షట్టర్లను పగలగొట్టిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన వేములవలస జంక్షన్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేములవలస కూడలిలోని అమరావతి వైన్ షాప్, వెంకటేశ్వర సెల్ పాయింట్ షట్టర్లను పగలగొట్టి వైన్‌షాపు సీసీ కెమెరాలకు గుడ్డ కప్పి ప్రవేశించిన దొంగల సుమారు రూ.63 వేల నగదును చోరీ చేశారు. సెల్ పాయింట్‌లో ఫోన్, రూ.13 వేలు తస్కరించారు. మరోనాలుగైదు దుకాణాల షట్టర్లను పగలగొట్టేందుకు విఫలయత్నం చేశారు. దీనిపై యజమానులు కోరాడ వెంకటరావు, వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చింతా వాసునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలు రేపు

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలను ఈ నెల 23న ఎన్‌ఏడీ రామకృష్ణ పాఠశాలలో నిర్వహించనున్నట్టు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.లక్ష్మణరావు, వైఏఆర్కే ప్రసాద్ తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 33,200 మంది విద్యార్థులు పాల్గొనగా, 120 జట్లు జిల్లాస్థాయికి అర్హత సాధించాయన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే రెండింటిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. ఎంపికైన విద్యార్థులంతా ఆదివారం ఉదయం 9.30గం.లకు రామకృష్ణ పాఠశాలకు చేరుకోవాలన్నారు. ఆర్జేడీ విజయ్ భాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. విద్యార్థులంతా సకాలంలో హాజరయ్యేలా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహారాణిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాదస్వరం, మంగళవాయిద్యాలు, వేద పండితులు, అర్చకుల మంత్ర పఠనంతో శాస్త్రోక్తంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈవో కె.శోభారాణి పర్యవేక్షణలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు పూజలు చేశారు. ఉదయం 8.40 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి,అమ్మవారికి క్షీరాభిషేకం, పసుపు కుంకుమలతో పూజలు, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలు, లడ్డు ప్రసాదం, సారె తీసుకువచ్చి సమర్పించారు. పోలిపాడ్యమి కావడంతో తొలిరోజే అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వయంగా పాలు, పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకాన్ని అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు.

ఉద్దానం కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం

- మూడేళ్లపాటు పరిశోధనకు రూ.6.01 కోట్లు మంజూరు
- ప్రాజెక్టు మెంటార్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ టి.రవిరాజు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.రవిరాజు. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జి.ప్రసాద్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు భారత ప్రభుత్వం ఆరోగ్య పరిశోధన విభాగం సీకేడీ అన్‌నోన్ ఇథియాలజీ ప్రాజెక్టును మంజూరుచేసిందని మెంటార్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.రవిరాజు తెలిపారు. ఏఎంసీ సెంటినరీ అలూమ్నీ భవనంలో శుక్రవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన పరిశోధన మూడేళ్లు సాగుతుందన్నారు. దేశంలో ఏడు శాతం మంది ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతుంటే, ఉద్దానంలో 18 శాతం మంది బాధపడుతున్నట్టు తేలిందన్నారు. ప్రాజెక్టులో భాగంగా అక్కడి ప్రజల రక్తం, యూరిన్ నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరిశోధనలకు ఐసీఎంఆర్ రూ.6.01 కోట్లు మంజూరు చేసిందన్నారు. పరీక్షల నిర్వహణకు రూ.కోటితో ల్యాబ్ ఏర్పాటుచేస్తామని, మట్టి, నీటి నమూనాలను తిరుపతి ల్యాబ్‌లో పరీక్షిస్తామన్నారు. తొలిదశలో 5,500 మంది నమూనాలు సేకరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. బయో మార్కర్స్ ద్వారా క్రానిక్ కిడ్నీ డిసీజ్‌ను త్వరగా గుర్తిస్తామని, సమస్య వచ్చేందుకు అవకాశం ఉన్న వారిని రెండు, మూడేళ్ల ముందుగానే గుర్తించి అప్రమత్తం చేయవచ్చునన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు బారినపడుతున్న వారిలో దాదాపు అంతా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారేనన్నారు. సమావేశంలో ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జి.ప్రసాద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియపై అవగాహన పెంచాలి

- సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ సీఈవో భావనా సక్సేనా



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న భావనా సక్సేనా

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న దత్తత ప్రక్రియపై అవగాహన పెంచాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) సీఈవో భావనా సక్సేనా పేర్కొన్నారు. నేషనల్ అడాప్షన్ కాంక్లేవ్ 2025కి ముందస్తు ప్రణాళికల నిమిత్తం శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ దత్తతపై అవగాహన కల్పించి, ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనధికార దత్తతను అడ్డుకోవాలని, మిషన్ వాత్సల్య పోర్టల్‌లో సాంకేతిక సమస్యలుంటే కారా దృష్టికి తీసుకురావాలన్నారు. డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి దత్తత ప్రక్రియలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్‌కు సంబంధించి సూచనలిచ్చారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీరామలక్ష్మి, డీసీపీవోలు కె.హరికృష్ణ, అల్లు సత్యనారాయణ, నోడల్ అధికారి సీహెచ్ సంతోషి కుమారి, డీసీపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

తీరప్రాంత రక్షణకు పటిష్ఠ చర్యలు: డీఐజీ



ఫిషింగ్ హార్బర్‌లో పర్యటిస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టీ

బీచ్ రోడ్డు, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత భద్రతను పర్యవేక్షించడానికి, దాడులను నిరోధించడానికి రాడార్ స్టేషన్లు నిఘా వ్యవస్థలు పనిచేస్తున్నాయని, పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు జరిగాయని డీఐజీ గోపినాథ్ జెట్టీ అన్నారు. ఫిషింగ్ హార్బర్ డ్రై డాక్ జెట్టీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీరం వెంబడి అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. దీనిపై మత్స్యకార గ్రామాల్లో అవగాహన కల్పించాలని, మెరైన్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిలిటెంట్లు తరచూ సముద్రమార్గాన్ని ఎంచుకుంటారన్నారు. జిల్లాలో 595 మత్స్యకార గ్రామాల పరిధిలో 21 మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. సముద్రంలో విపత్తులను, నౌకలోని సిబ్బంది ప్రయాణికులను రక్షించే తీరును తరచూ మాక్‌డ్రిల్స్ నిర్వహించడం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఆంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి కోస్ట్ గార్డులు, ఇండియన్ నేవీ, మెరైన్ పోలీసులు ప్రతి ఆరు నెలలకు మాక్ డ్రిల్ చేస్తారన్నారు. జిల్లాలో తీరప్రాంతం ఎక్కువని, ఉగ్రవాదులు చొరబడే ప్రమాదముంటుందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సాగర్ కవచ్ చేపడతామన్నారు. ఆయన వెంట డీఎస్పీ జి.బాలిరెడ్డి, ఏఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు, సీఐ ఎస్.రమేష్, నేవీ అధికారులున్నారు.

తాకట్టు బంగారంలో చిలక్కొట్టుడు!

- చోడవరం కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఘరానా మోసం
- చిన్న చిన్న ముక్కలు తొలగింపు
- లబోదిబోమంటున్న ఖాతాదారులు



చోడవరంలోని కనకమహాలక్ష్మి బ్యాంకు

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరంలోని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఘరానా మోసం వెలుగుచూసింది. ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారం వస్తువుల్లో చిన్నచిన్న ముక్కలను సిబ్బంది కత్తిరించుకుంటున్న వైనం బయటపడింది. పట్టణానికి చెందిన వెలుగుల దొరబాబు 60 గ్రాముల బరువు గల రెండు బంగారు నెక్లెస్‌లను బ్యాంకులో తాకట్టు పెట్టారు. రెండు రోజుల క్రితం విడిపించుకున్నారు. తాకట్టుపెట్టిన వస్తువులలో ముక్కలు తొలగించి ఉంచడాన్ని గమనించి స్థానిక నేత జయదేవ్ సహకారంతో బ్యాంకు అధికారులను నిలదీశారు. తప్పిదాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు, రెండు వస్తువులలో తగ్గిన రెండు గ్రాముల బంగారం ఆయనకు గురువారం తిరిగి ఇచ్చారు. మాజీ ప్రజా ప్రతినిధి సోదరుడు తాకట్టుపెట్టిన వస్తువులో కూడా కొంతమేర తగ్గడంతో నిలదీయగా తిరిగి ఇచ్చేందుకు అంగీకరించారు. ప్రస్తుతానికి ఇలా ఎనిమిది మంది ఖాతాదారులు మోసపోయినట్టు తేలింది.

బ్యాంకు అప్రైజర్ నిర్వాకమే

బ్యాంకులో బంగారం తనిఖీ చేసే అప్రైజర్ వెంకటేశ్, గతంలో పనిచేసిన బ్యాంకు అధికారి, కొందరు సిబ్బంది కలిసి మోసానికి పాల్పడినట్టు చెబుతున్నారు. బ్యాంకు అప్రైజర్ చేసిన మోసం తెలిసినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకుండా, అతడిని బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. కొత్తగా వచ్చిన అప్రైజర్ కూడా అతడి సోదరుడేనని అంటున్నారు.

ముందున్న వారి హయాంలోనే

బ్యాంకులో వెలుగుల దొరబాబు తాకట్టుపెట్టిన వస్తువుల్లో తగ్గిన బంగారం మేరకు తిరిగి ఇచ్చాం. తాకట్టుపెట్టిన బంగారంలో తగ్గుదల వచ్చిందని ఎనిమిది మంది ఫిర్యాదు చేశారు. వారి సమస్య పరిష్కరించాం. నేను ఇటీవల విధుల్లో చేరాను. ముందున్న వారి హయాంలో ఇది జరిగింది. విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్రైజర్‌ను బదిలీ చేశారు.

- కె.స్వామినాయుడు, బ్రాంచి మేనేజర్